ఫామ్‌హౌజ్‌లో ఉండడమే ఓ జైలు



# PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి



Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 221 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 08 ఆగస్టు 2025


# బిసి బిల్లును వెంటనే ఆమోదించండి

## 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఆర్డినెన్స్

**బిసిలపై చిత్తశుద్ధిని నిరూపించుకోండి**

**రాష్ట్రపతిని నేరుగా కలసి విన్నవిస్తాం**

**బిజెపి, బిఆర్ఎస్‌ల కితాబు అవసరం లేదు**

**మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి**



**న్యూఢిల్లీ, 07(పిసిడబ్ల్యు న్యూస్):** బీసీలపై ప్రేమ ఉంటే బీసీ బిల్లును కేంద్రం వెంటనే ఆమోదించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో మీడియాతోమాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ 42శాతం ఇవ్వాలన్నది తమ కమిట్మెంటని అన్నారు. రిజర్వేషన్ సాధనకోసం తాము చేయాల్సింది చేశామని చెప్పారు. కులగణన, రిజర్వేషన్ల సాధనలో మిగతా2లో...

# రాజీ పడే ప్రసక్తే లేదు..

## ట్రంప్‌కు ప్రధాని మోడీ కౌంటర్



**న్యూఢిల్లీ,ఆగస్టు 07(పిసిడబ్ల్యు న్యూస్):** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అదనపు సుంకాలపై ప్రధాని మోడీ స్పందించారు. రైతుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని, భారత్ రాజీ పడే ప్రసక్తే లేదని మోడీ కౌంటర్ ఇచ్చారు. రష్యా ముడి చమురు కొనుగోలు చేస్తుండటంతో అమెరికా అధ్యక్షు డు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై రెండుసార్లు అదనంగా 25 శాతం సుంకాలను విధించిన సంగతి తెలిసిందే. మిగతా2లో...

# నకిలీ జిఎస్టీ ఇన్‌వాయిస్‌లతో 750 కోట్ల లూటీ

## - మూడు రాష్ట్రాల్లో ఇడి సోదాలు




**న్యూఢిల్లీ,ఆగస్టు 07(పిసిడబ్ల్యు న్యూస్):** రూ. 750 కోట్ల విలువైన 'నకిలీ' జిఎస్‌టి ఇన్వాయిస్‌ల జనరేషన్ కేసులో భాగంగా జార్ఖండ్, పశ్చిమబెంగాల్,మహారాష్ట్రల్లో గురువారం ఈడి సోదాలు నిర్వహించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం మిగతా2లో...

# బీహార్‌లో లక్షల ఓట్ల తొలగింపు

**జాబితా చూపడానికి అభ్యంతరం ఎందుకు**

**మరోమారు ఇసి తీరుపై రాహుల్ విమర్శలు**



**న్యూఢిల్లీ,ఆగస్టు 07(పిసిడబ్ల్యు న్యూస్):**ఎన్నికల సంఘం తీరుపై మరోసారి కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పించారు. ఢిల్లీలో ఆయన మాట్లాడారు. ఈవీఎంలతో ఎన్నికల నిర్వహణపై అనుమానం కలుగుతుందన్నారు. అంచనాలకు అందని ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై అధ్యయనం చేశామని.. హర్యానా, మధ్యప్రదేశ్‌లోనూ అంచనాలకు భిన్నంగా ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యతిరేకత ఉన్న చోట కూడా బీజేపీకి మాత్రమే అనుకూలంగా వస్తున్నాయని చెప్పారు. మిగతా2లో...



# హైదరాబాద్‌లో వర్ష బీభత్సం

**భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయం**

**అప్రమత్తంగా ఉండాలని సిఎం రేవంత్ ఆదేశం**

**హైదరాబాద్, 07(పిసిడబ్ల్యు న్యూస్):**హైదరాబాద్ నగరంలో పెనుగాలులతో కుండపోత వర్షం బీభత్సం సృష్టించింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, గచ్చిబౌలి, కొండాపూర్, మియాపూర్, హిమాయత్‌నగర్, మిగతా2లో...

# ఫేక్ న్యూస్‌లను ప్రజలు నమ్మవద్దు.!

**మహిళలకు రూ.2500 జమ అంటు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వదంతులు నమ్మవద్దు: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి,ఆగస్టు 07(పిసిడబ్ల్యు న్యూస్):**ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంకులో అకౌంట్ ఉంటే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500 జమ చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వదంతులు నమ్మవద్దని, ఇది అసత్య ప్రచారమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఫేక్ న్యూస్ లను నమ్మవద్దని, ఇందులో ఎలాంటి వాస్తవమూ లేదని తెలిపారు. ప్రభుత్వ పరమైననిర్ణయాలను రాష్ట్ర /జిల్లా యంత్రాంగం అధికారికంగా ధ్రువీకరిస్తేనే వాస్తవంగా పరిగణించాలని పేర్కొన్నారు.



# చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం

**చేనేత ఉపాధి మాత్రమే కాదు...వారసత్వ కళ**

**పీపుల్స్ ప్లాజాలో చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభించిన తుమ్మల**

**హైదరాబాద్,ఆగస్టు 07(పిసిడబ్ల్యు న్యూస్):**చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని, అదేవిధంగా జియో ట్యాగింగ్ లో కూడా మనమే ముందున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. చేనేత అనేది కేవలం ఉపాధి మార్గం మాత్రమే కాదు అని, భారతీయ సంస్కృతికి ప్రతీక అని అన్నారు. ఇది తరతరాలుగా వారసత్వంగా అందిన హస్తకళ. ఈ కళను పరిరక్షించడం బాధ్యత మనందరి మీద ఉందన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు, వస్త్రాన్నిచ్చే నేతన్నకు మిగతా2లో...

# రెండున్నరేళ్లలో మళ్లీ అధికారంలోకి బిఆర్ఎస్

**అప్పుడు అందరి లెక్కలు సరిచేస్తాం**

**కాంగ్రెస్ పాలనతో విసుగెత్తిన ప్రజలు**

**మళ్లీ కెసిఆర్ సిఎం కావాలని కోరుకుంటున్నారు**

**పార్టీమారిన ఎమ్మెల్యేల తీరు అధ్వాన్నం**

**తెలంగాణ భవన్‌లో కెటిఆర్ వెల్లడి**



**హైదరాబాద్,ఆగస్టు 07(పిసిడబ్ల్యు న్యూస్):** రెండున్న రేళ్లలో బిఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, అప్పుడు అందరి లెక్కలు సరిచేస్తామని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో పరిగి నియోజకవర్గంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్త లు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ పాలనలో అందరికీ న్యాయం జరిగింది. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి పరిస్థితి విచిత్రంగా ఉంది. భూము లు విలువలు పడిపోయాయి. యూరియా కోసం రైతులు కష్టపడాల్సి వస్తోంది. పదేళ్లలో రేషన్ కార్డులు ఇవ్వలేదని ఐఏఎస్ అధికారులు అబద్ధాలు చెబుతున్నారు. ఐఏఎస్‌లు రాజకీయాలు మాట్లాడటం సరికాదు. రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. కాంగ్రెస్‌పై రైతులు ఆగ్రహంతో ఉన్నారు. ఓట్లు ఉన్నప్పుడు కాదు.. నాట్లు- వేసేటప్పుడు రైతుబంధు ఇవ్వాలి. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిశాక ప్రభుత్వం రైతుబంధు నిలిపివేస్తుంది. ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు పెట్టి బీసీ సబ్‌ప్లాన్‌ను ప్రవేశపెట్టాలి.

మిగతా2లో...

# ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక

**• ఎన్‌డిఎ పక్షాల భేటీలో చర్చ • నిర్ణయం మోడీ,నడ్డాలకు అప్పగింత**



**న్యూఢిల్లీ,ఆగస్టు 07(పిసిడబ్ల్యు న్యూస్):** ఉప రాష్ట్రపతి ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక చేసే నిర్ణయాన్ని ప్రధాని నరేంద్ర మోదీతోపాటు- , బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ జడ్డాకు దాఖలు పరుస్తున్నట్లు- ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు ప్రకటించాయి. గురువారం న్యూఢిల్లీలో పార్లమెంట్ చాంబర్‌లోని జేపీ నడ్డా కార్యాలయంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకు చెందిన కీలక నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై వారంతా చర్చించారు. అనంతరం అభ్యర్థి ఎంపిక బాధ్యతను ప్రధాని మోదీతోపాటు- పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు అప్పగిస్తూ.. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఏకగ్రీవ తీర్మానం చేశారు. మిగతా2లో...

## బీసీ రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడుతాం

2లో

# రాజీ పడే ప్రసక్తే లేదు..

(మొదటి పేజీ తరువాయి)

ఈక్రమంలో గురువారం ఢిల్లీలో జరిగిన ఎంఎస్ స్వామినాథన్ శతాబ్ది అంతర్జాతీయ సమావేశంలో ప్రధాని మాట్లాడుతూ.. "మాకు రైతుల ప్రయోజనాలే ముఖ్యం. భారత్ ఎప్పుడూ రైతులు, మత్స్యకారులు, పాడి రైతుల ప్రయోజనాల విషయంలో రాజీపడదు. సుంకాల పెంపుతో నష్టం జరుగుతుందని నాకు తెలుసు. దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాను. దేశంలోని రైతులు, మత్స్యకారుల కోసం ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొంటాం" అని అన్నారు.

# నకిలీ జిఎస్టీ ఇన్‌వాయిస్‌లతో 750 కోట్ల లూటీ

(మొదటి పేజీ తరువాయి)

కింద మూడు రాష్ట్రాల్లో సుమారు 12కి పైగా ప్రాంతాల్లో దాడులు నిర్వహించినట్లు- అధికారిక వర్గాలు తెలిపాయి. జార్ఖండ్‌లో షెల్ సంస్థలు మరియు అనధికార ఆర్థిక మార్గాల్లో రూ.750 కోట్ల నకిలీ ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ జనరేషన్‌కు సంబంధించిన కేసు ఇది. ఈ కేసుకు సంబంధించిన కీలక సూత్రధారి శివకుమార్ దేవరాను ఈ ఏడాది మేలో అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఆయనపై చార్జిషీట్ దాఖలు చేసినట్లు- ఆ వర్గాలు తెలిపాయి. మనీలాండరింగ్‌లో అనేక మంది వ్యక్తులు మరియు సంస్థల ప్రమేయం ఉన్నట్లు- సూచించే విశ్వసనీయ ఆధారాలతో ప్రస్తుతం సోదాలు చేపడుతున్నట్లు- ఆ వర్గాలు వెల్లడించాయి.

# బీహార్‌లో లక్షల ఓట్ల తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

బీహార్‌లో లక్షల మంది ఓట్లను తొలగించారన్నారు. బీహార్‌లో ఓట్ల తొలగింపుపై ఈసీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అయినా ఓటర్ల జాబితా దేశ సంపద అని.. దానిని ఎందుకు చూపించట్లేదని నిలదీశారు. మహారాష్ట్రలో ఐదు నెలల్లోనే 40 లక్షల మంది ఓటర్లు నమోదయ్యారని.. ఐదేళ్లలో నమోదైన వారి కంటే.. ఐదు నెలల్లో నమోదైన ఓటర్లే ఎక్కువగా ఉన్నారని చెప్పారు. మహారాష్ట్రలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య సమయంలో కోటి మంది ఓటర్లు నమోదయ్యారన్నారు. ఆ సమయంలో ఓటర్ల జాబితా ఇచ్చేందుకు ఈసీ నిరాకరించిందని గుర్తుచేశారు. దేశ సంపదను చూపించేందుకు ఎన్నికల సంఘానికి వచ్చిన ఇబ్బందేంటని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. బీహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సర్వేపై తీవ్ర ఆందోళనలు జరుగుతున్నాయి.

# హైదరాబాద్‌లో వర్ష బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

లక్డీకపూల్, నాంపల్లి సహా పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పంజాగుట్ట, ఎస్‌ఆర్ నగర్, అమీర్‌పేట్, మాదపూర్, కొండాపూర్, బయోడైవర్సిటీ-, ఐకియా సెంటర్, ఏఎంబీ, ఇనార్బిట్ మాల్, కొండాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, హైటెక్‌సిటీలో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.. వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వచ్చే 2 రోజులపాటు- రాష్ట్రంలో విస్తారమైన వర్షాలు పడే అవకాశం ఉంది. హైదరాబాద్‌తో పాటు- రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రానున్న రెండు రోజులు వర్షాలు ఉంటాయనే సమాచారం ఉన్నందున కలెక్టర్లు జిల్లాల్లోని అన్ని విభాగాలతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్ లో పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి వరకు భారీ వర్ష సూచన ఉన్నందున అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలన్నారు. జీహెచ్ఎంసీతో పాటు- పోలీస్, ట్రాఫిక్, హైడ్రా విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని.. లోతట్టు- ప్రాంతాల్లో తగిన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. సిటీ-లో ప్రజలు అత్యవసరమైతే తప్ప తమ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, విద్యుత్ అంతరాయం లేకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని.. వర్షాలు, వరదలతో ఎటువంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కునేందుకు, ఎలాంటి సహాయమైనా అందించేందుకు అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.


# ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక

(మొదటి పేజీ తరువాయి)

ఆ తీర్మానానికి ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు ఆమోదించాయి. అలాగే భారత ఉప రాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబర్ 9వ తేదీన జరగనుంది. ఈ నేపథ్యంలో ఆ ముందు రోజు అంటే.. సెప్టెంబర్ 8వ తేదీన ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు సమావేశం కావాలని ఈ భేటీలో నిర్ణయించారు.ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జేపీ నడ్డాతోపాటు- ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకు చెందిన కీలక నేతలు జేడీ (యూ) నుంచి లలాన్ సింగ్, శివసేన నుంచి శ్రీకాంత్ షిండే. టీ-డీపీ నుంచి లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎల్‌జేపీ నుంచి కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించారు. మరోవైపు ఉప రాష్ట్రపతి పదవికి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. సెప్టెంబర్ 9వ తేదీన ఈ ఎన్నిక నిర్వహించనున్నట్లు- కేంద్రం ఎన్నికల సంఘం గురువారం అంటే ఆగస్ట్ 7వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పదవికి పోటీ- చేసే అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసేందుకు ఆగస్ట్ 21వ తేదీ చివరి తేదీగా ప్రకటించింది. ఇక 22వ తేదీన నామినేషన్ల పరిశీలన, 25వ తేదీన నామినేషన్ల ఉపసంహారణ గడువు విధించినట్లు- తెలిపింది. సెప్టెంబర్ 9వ తేదీన పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు ఉంటు-ందని ఎన్నికల సంఘం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. జులై 21వ తేదీన జగదీప్ దన్‌ఖడ్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలతోనే తాను ఈ పదవికి రాజీనామా చేసినట్లు- ఆయన ప్రకటించారు. అసలు అయితే ఆయన పదవీ కాలం 2027, ఆగస్ట్ వరకు ఉంది. ఈ నేపథ్యంలో ఉప రాష్ట్రపతి పదవికి ఎన్నిక అనివార్యమైంది.

# ఫామ్‌హౌజ్‌లో ఉండడమే ఓ జైలు

## ● కెసిఆర్ అరెస్ట్‌పై రేవంత్ వ్యాఖ్య



**న్యూఢిల్లీ,ఆగస్టు 07(పిసిడబ్ల్యు న్యూస్):** కేసీఆర్ అరెస్ట్ వార్తలపై సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే కేసీఆర్ అరెస్ట్ ఊహాగానాలకు తెరదించారు. కేసీఆర్ స్వీయ నియంత్రణలో బందీ అయ్యారని.. కొత్తగా ఆయన్ని జైల్లో పెట్టాల్సి అవసరం లేదని సీఎం రేవంత్ అన్నారు. చర్లపల్లి జైలుకు ఫామ్‌హౌస్‌కు పెద్ద తేడా లేదన్నారు. ఫామ్‌హౌస్‌లో పర్యవేక్షణ ఉంటుంది. జైల్లో పహారా ఉంటుందని చెప్పారు. ఆయన ఓ రకంగా జైల్లో ఉన్నట్లేనని అన్నారు. ప్రజలతో సంబంధాలు లేకుండా కేవలం ఫామ్‌హౌజ్‌కు పరిమితంకావడంతో జైలులాంటి జీవితానికి అలవాటుపడ్డారని అన్నారు. కేసీఆర్‌ను ప్రజలు ఓడించడమే పెద్ద శిక్ష అంటూ వ్యాఖ్యానించారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులతో కలిసి సీఎం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్ఆయఖ్యలు చేశారు.

# బిసి బిల్లును వెంటనే ఆమోదించండి

(మొదటి పేజీ తరువాయి)

తమ చిత్త శుద్ధిని ఎవరు శంకించలేరన్నారు. రాష్ట్ర ప్రభుత్వంగా అన్ని విధాల ప్రక్రియ పూర్తి చేశామన్న రేవంత్.. ప్రస్తుతం బీసీల రిజర్వేషన్ అంశం కేంద్రం పరిధిలో ఉందన్నారు. కేంద్రం, బీజేపీ కోర్టులో రిజర్వేషన్ల అంశం ఉందన్నారు. వాళ్లకు నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే బీసీ బిల్లును ఆమోదించాలన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచడం కోసంబీసీలకు న్యాయమైనా వాటా కోసమే తమ పోరాటమని సీఎం రేవంత్ చెప్పారు. జంతర్ మంతర్ వేదికగా తమ వాణిని బలంగా వినిపించామన్నారు. జంతర్ మంతర్ ధర్నాపై బీజేపీ, బీఆర్ఎస్ నేతల విమర్శలు విడ్డూరమన్నారు. తమ కమిట్ మెంట్ కు వాళ్ల సర్టిఫికేట్ అవసరం లేదని వ్యాఖ్యానించారు రేవంత్. ప్రజలను అబద్ధపు మాటలు చెప్పి మభ్యపెట్టబోమని... అది తమ నైజం కాదన్నారు. బీసీలకు రాహుల్ ఇచ్చిన మాటను అమలుచేడమే తమ టార్గెట్ అని తెలిపారు. మోదీ చేతుల్లోనే బీసీ రిజర్వేషన్ నిర్ణయం ఉందన్నారు సీఎం రేవంత్. తమ ఆఖరి పోరాటాన్ని పూర్తిచేశాం.. ఇక బీజేపీ నిర్ణయం తీసుకోవాలన్నారు. రాష్ట్రపతికి రాజకీయాలకు సంబంధం లేదన్నారు రేవంత్. కేంద్రం బిల్లుకు ఆమోదించక పోతే.. స్థానిక సంస్థల ఎన్నికలపై ఎలా వెళ్లాలో ఆలోచిస్తామని చెప్పారు. గ్రామస్థాయి నుంచి ప్రజల అభీష్టం మేరకే పార్టీ నిర్ణయం తీసుకుంటామన్నారు. లోకల్ బాడీ ఎన్నికలను సెప్టెంబర్ 30 లోపు నిర్వహించాలని హైకోర్ట్ చెప్పిందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు కోసం పోరాడుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బిల్లును రాష్ట్రపతి ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నామన్నారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోసం సాయంత్రం వరకు వేచి చూస్తాం. రాష్ట్రపతి స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నాం. ఆమె సమయం ఇవ్వలేదంటే ప్రధాని ఒత్తిడి చేసినట్టు భావించాల్సి ఉంటుంది. 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఉన్న మార్గాలన్నింటిని ప్రయత్నించాం. కుదరనప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల్లో స్థానిక ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు మా వద్ద 3 మార్గాలు ఉన్నాయి. 50శాతం సీలింగ్‌పై గత ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని పక్కన పెట్టి జీవో ఇవ్వాలి. జీవో ఇస్తే.. ఎవరైనా కోర్టుకు వెళ్తే స్టే వస్తుంది. కాబట్టి జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లే మొదటి మార్గం సాధ్యం కాదు. ఇప్పుడే స్థానిక ఎన్నికలు పెట్టకుండా ఆపడం రెండో మార్గం. స్థానిక ఎన్నికలు ఆపితే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగుతాయి. కేంద్ర నిధులు రాకుంటే గ్రామాల్లో వ్యవస్థలు కుప్పకూలుతాయి. మూడో మార్గం పార్టీ పరంగా బీసీలకు 42శాతం సీట్లు- ఇవ్వడం. బీసీలకు 42శాతం సీట్లపై ఇతర పార్టీలపైనా ఒత్తిడి తెస్తాం అని సీఎం తెలిపారు. సమయం కూడా తక్కువగా ఉందని అందుకు అనుగుణంగా తమ కార్యాచరణ ఉంటుందని అన్నారు.

# రెండున్నరేళ్లలో మళ్లీ అధికారంలోకి బిఆర్ఎస్

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డికి కేసీఆర్ అంటే భయం పట్టు-కుంది. అందుకే దిల్లీలో కూడా ఆయన్నే విమర్శిస్తున్నారు. భారత రాష్ట్ర సమితి పాలనలో జరిగిన మంచి పనులు కార్యకర్తలు చెప్పలేకపోయారు.. అందుకే ఓడిపోయాం. కేసీఆర్‌ను మళ్లీ సీఎంను చేయడానికి అందరం కలిసికట్టు-గా పనిచేయాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉన్నంత కాలం ఈ గులాబీ కండువా బరాబర్ ఉంటది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీకు మూడు చెరువుల నీళ్లు తాగించి మళ్లొక్కసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందామని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అనవసరంగా గెలిపించామని రైతులు, మహిళలు, నిరుద్యోగులు బాధపడుతున్నారు. మొన్ననే నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్‌కు సంవత్సరికం చేశారు. కొడంగల్‌లో విషయం అర్థమైంది కాబట్టే కాంగ్రెస్ కార్యకర్తలు ఆ పార్టీలో ఉండే ప్రయత్నం చేయట్లేదు. ఎక్కడ కోల్పోయామో అక్కడే వెతుక్కోవాలి. నేల విడిచి సాము చేయొద్దు. గట్టిగా పని చేస్తే మనమే గెలవబోతున్నాం. అప్పుడు అధికారులందరూ మన చుట్టే తిరుగుతారు. పార్టీ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం అని కేటీ-ఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో విపరీతమైన కోపం ఉంది. మనకు ఓటేయడానికి ప్రజలు సుముఖంగా ఉన్నారు. అవసరమైతే మనం చేసిన తప్పులను క్షమించండి అని అడగాలి. పద్ధతిగా పని చేయాలి. పోయినా పదేండ్లలో పార్టీని పెద్దగా చూడలేదు. వచ్చేసారి కంటికి రెప్పలా కాపాడుకుంటాం. ఆర్థికంగా బలోపేతం చేస్తాం. పార్టీ నిర్మాణంపై కూడా దృష్టి పెడుతాం. బీఆర్ఎస్ ఉండనే ఉండదు బీజేపీలో పోతదని తలకు మాసినోళ్లు అంటు-న్నరు మనకేం కర్మ పట్టింది. తెలంగాణ ఉన్నంతకాలం ఈ గులాబీ కండువా బరాబర్ ఉంటది. రెండు పార్టీలకు మూడు చెరువుల నీళ్లు తాగించి మళ్లొక్కసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందాం. మన రాష్ట్రాన్ని కాపాడుకుందాం అని గులాబీ సైనికులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ఇకపోతే పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలకు కేటీఆర్ చురకలంటించారు. ఆ పదిమంది ఎమ్మెల్యేలు విచిత్రంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మన పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు కొంతమంది పార్టీ మారారు. ఇక పార్టీ మారిన తర్వాత.. పార్టీ మారినం అని చెప్పుకోవాలి కదా..! ఏ పార్టీలో ఉన్నావ్ అంటే ఈ పార్టీలో ఉన్నా అని చెప్పుకోవాలి. ఇక ఓ వీడియోలో ఏ పార్టీలో ఉన్నావ్ సర్ అని ఓ విలేకరి అడుగుతుంటే ఏ పార్టీలో ఉండాల్నో ఆ పార్టీలోనే ఉన్నా అంటడు ఓ ఎమ్మెల్యే. మీ పిల్లలకు బయటకు పోయి టైమ్‌కు రాకపోతే.. ఫోన్ చేసి అడిగినప్పుడు యేడా ఉండాల్నో అక్కడే ఉన్నా అంటే వాన్ని దవడ మీదికెళ్లి ఒక్కటి సంపుతవ్. ఇంటికి రాగానే దవడ మీద ఓటి సరుస్తామా..? లేదా..? అని కేటీ-ఆర్ ప్రశ్నించారు. ఇక ఈ 20 నెలలో విచిత్రమైన అనుభవాలు చూస్తున్నాం. కాలే యాదయ్య ఏ పార్టీలో ఉన్నడు అని చిన్న పిల్లగాన్ని అడిగినా కాంగ్రెస్‌లో ఉన్నడు అని చెప్తరు. కానీ స్పీకర్‌కు అర్థమైతలేదు. ఆయన ఏ పార్టీలో ఉన్నడో శోధించి, పరిశోధించి, మళ్లీ ఎం-కై-÷-వరీ పెట్టి చెప్తారట. రేవంత్ రెడ్డి పరిపాలన వచ్చాక అనుభవాలు ఎంత తమాషాగా ఉన్నాయంటే.. పది మంది ఎమ్మెల్యేల పరిస్థితి ఎట్ల తయారైదంటే.. మీరు ఏ పార్టీలో ఉన్నారని అడిగితే.. మేం బీఆర్ఎస్‌లోనే ఉన్నామని సుప్రీంకోర్టులో రాస్తున్నారు. మరి నువ్వు కండువా కప్పుకున్నావ్ కదా అంటే ఇది దేవుని కండువా అని అంటు-న్నరు. అది కాంగ్రెస్ కండువా కాదు అని చెబుతున్నరు. ఇలా 20 నెలలుగా విచిత్రమైన పరిస్థితి నెలకొని ఉంది అని కేటీఆర్ విమర్శించారు.

# చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు- చేసిన చేనేత ప్రదర్శన కార్యక్రమంలో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. కొండా లక్ష్మణ్ బాపుజీ చేనేత పురస్కారానికి ఎంపికైన చేనేత కళాకారులకు ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. తెలంగాణ రాష్ట్రం చేనేత రంగంలో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును సంపాదించిందని, గద్వాల, నారాయణపేట, పోచంపల్లి ఇక్కత్, సిద్దిపేట గొల్లభామ, వరంగల్ దర్రిస్, కరీంనగర్ బెడ్‌షీట్లు-వంటి ఉత్పత్తులు అంతర్జాతీయంగా పేరుగాంచాయని పేర్కొన్నారు.చేనేత ఉత్పత్తుల వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వ శాఖలు టెస్కో ద్వారానే వస్త్రాలను కొనుగోలు చేయాలనే ఆదేశాలు ఇచ్చినట్టు- తెలిపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తూ చేనేత కళను కొత్త తరం వరకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా త్రిలింగ పట్టు-చీరలను,లోగోను మంత్రి ఆవిష్కరించారు. చేనేత కార్మికులకు ఏ సమస్య వచ్చిన మా ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా మంత్రిగారు హామీ ఇచ్చారు. చేనేత దినోత్సవం సందర్భంగా పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు- చేసిన వస్త్ర ఎగ్జిబిషన్ లో 100 పైగా స్టాల్స్ ను మంత్రి ప్రారంభించి, వారు తయారుచేసిన చేనేత ఉత్పత్తులను పరిశీలించారు. ముఖ్యంగా జైలు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు-చేసిన స్టాల్లోని వస్త్రాలను మంత్రి ప్రత్యేకంగా పరిశీలించి అభినందించారు. అంతేకాకుండా కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత అవార్డులకు ఎన్నికైన వారు తయారుచేసిన ఉత్పత్తులను పరిశీలించిన ఆయన, వారిని అభినందించారు. ఈ సందర్భంగా జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ.. అంతరించిన పోతున్న చేనేత కళలన్నింటికి పునర్వైభవం తెచ్చేలా ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ ప్రభుత్వం చేనేత కార్మికుల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని అన్నారు. అందులో భాగంగా రెండు సంవత్సరాల కాల వ్యవధితో నేతన్న పొదుపు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. మరణించిన చేనేత కుటుంబానికి అండగా ఉండేలా నేతన్నకు భద్రత పథకం ద్వారా మరణించిన కుటుంబ నామినికి 5 లక్షలు అందజేస్తున్నామన్నారు. మార్చి నెలలో ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా చేనేత రుణమాఫీ కోసం 33 కోట్లు- విడుదల చేశామన్నారు. చేనేత కార్మికులకు సంవత్సరానికి 18 వేలు, అనుబంధ కార్మికులకు 6 వేలు వచ్చేలా నేతన్న భరోసా పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఒఒఐ÷ు ని ప్రారంభించి, 120 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వడం జరిగిందన్నారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడుతాం

## కిషన్ రెడ్డి లాంటి వారి కుట్రలు సాగనివ్వం

## మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్

**న్యూఢిల్లీ,ఆగస్టు 07(పిసిడబ్ల్యు న్యూస్):** బీసీ రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధేయ పద్ధతిలో పోరాడి అనుకున్నది సాధిస్తామన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లాంటి వారి కుట్రలను సాగనివ్వమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా చావుతప్పి కన్నులొట్టబోయిన చందంగా.. గెలిచిందని ఎద్దేవా చేశారు. ఉత్తరాదిలో చాలా రాష్ట్రాల్లోబీసీలు ఆ పార్టీని తిరస్కరించారని చెప్పారు. రిజర్వేషన్లు పెంచకుంటే వచ్చే ఎన్నికల్లో భాజపా ఓటమి ఖాయమని పేర్కొన్నారు. శాసనసభలో బీసీ బిల్లుపై తీర్మానం సందర్భంలో కిషన్‌రెడ్డి దానికి వ్యతిరేకంగా అభిప్రాయం చెప్పిఉంటే ఆరోజే చర్చ జరిగేది. కానీ ఆ బిల్లు చట్టం రూపంలో మారి గవర్నర్ ఆమోదంతో దిల్లీకి వచ్చిన తర్వాత మీరు ముస్లింల పేరుతో ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు. వారికి రిజర్వేషన్లు ఇప్పుడే కొత్తగా ఇవ్వడం లేదన్నారు. మిమ్మల్ని బహిరంగ చర్చకు కూడా ఆహ్వానించ దల్చుకున్నా. మా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. కామారెడ్డి డిక్లరేషన్ నుంచి జంతర్ మంతర్ ధర్నా వరకు మేం బాధ్యతగా ఉన్నాం అని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉత్తరాదిలో చాలా రాష్ట్రాల్లో బిసిలు బిజెపిని తిరస్కరించారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లాంటి వారి కుట్రలను సాగనివ్వమని అన్నారు. లోక్ సభ ఎన్నికల్లో బిజెపి చావుతప్పి కన్నులొట్ట అన్నట్లు-గా గెలిచిందని విమర్శించారు. బిసి రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడుతామని సవాల్ విసిరారు. బిసి రిజర్వేషన్లు పెంచపోతే వచ్చే ఎన్నికల్లో బిజెపి ఓటమి ఖాయమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బీసీ కోటాను అడ్డుకునే కిషన్ రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. కేంద్రమంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి బీసీలపై మాట్లాడేమాటలు కరెక్ట్ కాదన్నారు. బీసీ కోటా ఇవ్వడం కుదరదని కిషన్ రెడ్డి లేఖ ఇవ్వాలన్నారు. బీసీ కోటాకు బీజేపీ నేతలు అడ్డుపడుతున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉందన్నారు. సమగ్ర కులగణ సర్వేను పకడ్బందీగా నిర్వహించామని చెప్పారు. అశాస్త్రీయమైన సర్వే చేసి, బీసీల సంఖ్యను తగ్గించారని కిషన్ రెడ్డి అన్నారు. ఆ తర్వాత దీనికి 10 శాతం ముస్లింలను చేర్చి.. బీసీలను మోసం చేస్తున్నారని అన్నారు . తెలంగాణ ప్రభుత్వం ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం వల్ల బీసీలకు కేవలం 32 శాతం మాత్రమే రిజర్వేషన్లు



అందుతాయని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఇది బీసీలను మోసం చేయడమేనని చెప్పారు. ముస్లింలను బీసీల్లో చేర్చడాన్ని బీజేపీ అంగీకరించదన్నారు. ముస్లింలకు రిజర్వేషన్లు తొలగిస్తే, బీసీ రిజర్వేషన్ల బాధ్యతను తాను తీసుకుంటానని అన్నారు కిషన్ రెడ్డి. బీసీ రిజర్వేషన్లపై హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీనే వాటిని అమలు చేయాలని కిషన్‌రెడ్డి అన్నారు. అది కాకుండా బట్టకాల్చి బీజేపీపై వేస్తామంటే ఊరుకోబోమని మండిపడ్డారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ పెట్టుకున్న సభ.. గాంధీ కుటుంబాన్ని పొగడటానికే సరిపోయిందని ఎద్దేవా చేశారు. సీ రిజర్వేషన్లు ఇస్తామని తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ హామీ ఇచ్చింది..దాన్ని పూర్తిచేసుకోవాల్సిన బాధ్యత ఆ పార్టీదే. అందుకోసం న్యాయపరమైన, చట్టపరమైన అంశాలపై దృష్టిసారించి, చిత్తశుద్ధితో పనిచేయాలి తప్ప.. బట్టకాల్చి బీజేపీ మీద వేస్తానంటే చూస్తూ ఊరుకునేది లేదని ఆయన అన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**హన్మకొండ ఆగస్టు 07(పిసిడబ్ల్యు న్యూస్):** స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్ల పై జాయింట్ కలెక్టర్ సంధ్యారాణితో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన ఉదయం ఖిలా వరంగల్లోని ఖుష్ మహల్ మైదానం లో నిర్వహించే వేడుకల్లో జండా వందన కార్యక్రమాన్ని అవసరమైన అన్ని ఏర్పాట్లు, వేదికను అలంకరించాలని ఆదేశించారు. ఈ కార్య క్రమానికి హాజరయ్యే ప్రజా ప్రతినిధులు స్వాతంత్ర సమర యోధుల కుటుంబాలకు ఇతర అతిధులకు వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలన్నారు. తాగునీటి సౌకర్యం, మొబైల్ టాయిలెట్ లో రైన్ ప్రూఫ్ టెంట్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలకు సంబంధించిన సాధించిన ప్రగతిని చాటి చెప్పాలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాలు కన్నుల పండుగగా జరిగేలా సిద్ధం చేయాలని విద్యాశాఖ అధికారినీ ఆదేశించారు. అంబులెన్స్ అగ్ని మాపక వాహనం అందుబాటులో ఉంచాలని అన్నారు. ఆయా శాఖలలో విశిష్ట సేవలు అందించిన ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించేందుకు ప్రతి పాదనలు గడువులో గా అందించాలన్నారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ విజయలక్ష్మి, డి జెడ్ పి, సిఈ ఓ రామిరెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, డిఆర్ డి ఓ కౌసల్యాదేవి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 13న ఛలో హైదరాబాద్‌కు పిలుపు

## హనుమకొండ జిల్లా వి హెచ్ పి ఎస్, వృద్ధులు, వితంతువుల పెన్షన్ దారుల సన్నాహక మహాసభ





**హన్మకొండ ఆగస్టు 07(పిసిడబ్ల్యు న్యూస్):** హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం లోని యం టి ఆర్ గార్డెన్ లో వి హెచ్ పి ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిధులుగా.. వి హెచ్ పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ హాజరయ్యారు. ఈ కార్య క్రమానికి సభాధ్యక్షులు వి హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దూడల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూవికలాంగుల పెన్షన్ 4000 నుండి 6000 కు, వృద్ధులు, వితంతువుల పెన్షన్ 2016 నుండి 4000 వరకు కండరాల క్షీనత రోగులకు, ఇతర తీవ్రమైన రోగులకు 15000 కి ఆంధ్రప్రదేశ్ లో లాగా పెంచి, తెలంగాణ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, హెచ్చరించారు. అందాల పోటీలకు, భూస్వాములకు రైతు భరోసాకు, అభివృద్ధి పేరుతో వేల కోట్ల ఖర్చు పెడుతున్నప్పుడు, కాళ్ళు, కళ్ళు, మాట్లాడలేని వికలాంగులకు, వయసు మీద పడిన వృద్ధులకు, భర్త లేకుండా బిడ్డలను పోషించే శక్తి లేని వితంతువులకు, తీవ్రమైన రోగాలతో చావుతో సావాసం చేస్తున్న కండరాల, రక్త హీనత ఇతర రోగులకు ఎందుకు ఇచ్చిన మాట నిలబెట్టుకొని పెన్షన్ పెంచకుండ అన్యాయం చేస్తున్నావో ఆ సమాజానికి సమాధానం చెప్పాలని, తప్పు తెలుసుకొని ఆగస్టు మొదటి వారం లోపు మా 15 డిమాండ్స్ తీర్చకపోతే రేవంత్ రెడ్డి నాయకత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ఆగస్టు 13 న హైదరాబాద్, ఎల్ బి స్టేడియంలో లక్షలాది మందితో జరిగే మహాగర్జన మహాసభతో కుప్ప కూల్చుతామని హెచ్చరించారు. ఈ పేద వర్గాల పెన్షన్ ను పెంచని ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నించకుండా ప్రతిపక్ష పార్టీలు కూడా అన్యాయం చేస్తున్నారని, ఇప్పటికైనా ప్రతిపక్ష, విపక్ష పార్టీల మౌనం వీడాలని గుర్తు చేశారు. ఎమ్మార్పీస్ పోరాటం తో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆరోగ్యశ్రీ, వికలాంగుల, వృద్ధుల, వితంతువుల పెన్షన్ 200 నుండి 1000, 1500, 2000 సాధించుకొని ఆంధ్రప్రదేశ్ లో నేడు 6000 సాధించడం జరిగిందని ఆ స్ఫూర్తి తో తెలంగాణా లో కూడా పెన్షన్ 6000 కు, ఇతర డిమాండ్స్ సాధించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఆంధ్ర ప్రదేశ్ ఎం ఎస్ పి రాష్ట్ర అధ్యక్షులు వైకె విశ్వనాథ్ మాదిగ, హనుమకొండ జిల్లా ఇంచార్జ్ కందుకూరి సోమన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ,ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు బండారి సురేందర్ మాదిగ ,ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకులు ఆరేపల్లి పవన్ మాదిగ,ఎమ్మెస్పి జిల్లా ఉపాధ్యక్షులు రాజారపు బిక్షపతి మాదిగ మరియు జిల్లా లోని వికలాంగులు, వృద్దులు, వితంతువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వంద రోజుల కార్యాచరణలో భాగంగా భువన్ సర్వే చేపట్టండి





- నగర మేయర్ గుండు సుధారాణి
- రెవెన్యూ అధికారులు, సిబ్బందితో నీటి పన్ను వసూళ్ల పై సమీక్ష

**హన్మకొండ ఆగస్టు 07 (పిసిడబ్ల్యు న్యూస్):** వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా భువన్ సర్వే చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో నీటి పన్ను వసూళ్ల పై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మేయర్ పాల్గొని సమర్థ వంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నీటి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, పి ఓ ఎస్ మిషన్ లకు ట్రాకింగ్ వ్యవస్థ ఉంటే ఐసిసి కేంద్రానికి అనుసంధానం చేయాలని వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా భువన్ సర్వే చేపట్టాలని, గత 5 సం.ల నుండి పేరుకు పోయిన రూ.48 కోట్ల నీటి పన్ను లు బకాయిలను ఆయా ప్రాంతాలు, బిల్ కలెక్టర్ ల వారిగా వసూళ్ళ చేపట్టాలని, కమర్షియల్ నల్లా కనెక్షన్ లను గుర్తించి వాటి బకాయిలు వసూళ్ళు చేయాలని, నీటి సరఫరాకు సంబంధించి కార్పొరేషన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ప్రతి రోజు 300 మంది పన్ను బకాయి దారులను గుర్తించి వారిని పన్నులు చెల్లించేలా చూడాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఆర్ ఓ లు శ్రీనివాస్, షహజాది బేగం, ఐటి మేనేజర్ రమేష్, ఆర్ ఐ లు, బిల్ కలెక్టర్ లు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా చేనేత దినోత్సవ వేడుకలు

- పద్మశాలి చేనేత కార్మికులకు సన్మానం

**పెద్దవంగర ఆగస్టు 07 (పిసిడబ్ల్యు న్యూస్):** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వడ్డె కొత్తపల్లి గ్రామంలో ఘనంగా అంతర్జాతీయ చేనేత కార్మికుల దినోత్సవ ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో చేనేత పై ఆధారపడిన వారిని చేనేత యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ పద్మశాలి లకు చేనేత కార్మికులకు సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా పెద్దవంగర మండల లయన్స్ క్లబ్ అధ్యక్షులు మల్లికార్జున చారి. మాట్లాడుతూ ప్రతి సంవత్సరం భారతదేశంలో ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోవడం జరుగుతుంది. చేనేత కార్మికుల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి చేనేత పరిశ్రమను ప్రోత్సహించడానికి జాతీయ చేనేత దినోత్సవం జరుపుకుంటున్నారు. తొలిసారిగా 2015 ఆగస్టు 7న ప్రధాని నరేంద్ర మోడీ చెన్నైలో ప్రారంభించారు. చేనేత కార్మికులు ఒక చీర నేయడానికి కుటుంబం మొత్తం నెలల తరబడి పని చేయడం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం,వీరి యొక్క శ్రమను గుర్తించి వీరికి ఆర్థిక సహాయం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ ఎదునూరి శ్రీనివాస్. అధ్యక్షులు మల్లికార్జున చారి, ప్రధాన కార్యదర్శి రాపోలు శ్రీనివాస్,కోశాధికారి మధుసూదన్ రెడ్డి,ముత్తినేని శ్రీనివాస్, మొర్రిగాడుదుల శ్రీనివాస్, గట్ల లక్ష్మి నారాయణ. గుల్లపల్లి సదానందం, సుభాష్ చంద్రబోస్, గుమ్మడివెల్లి వెంకటేశ్వర్లు. వేముల సత్యనారాయణ. వేముల వెంకటనారాయణ. గుండు శ్రీనివాస్. వేముల రమేష్. తదితరులు పాల్గొన్నారు.




# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష




**పరకాల, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష విధించినట్లు సీఐ క్రాంతి కుమార్ తెలిపారు. ఈనెల 03 న పరకాల పట్టణ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో పరకాల మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన పేర్వాల రమేష్ అనే వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుపడగా అతనిని గురువారం పరకాల స్పెషల్ సెకండ్ క్లాస్ జుడిషియల్ మెజిస్ట్రేట్ కొప్పుల శంకర్ ముందు కోర్టు కానిస్టేబుల్ నాగరాజు. అట్టి వ్యక్తిని హాజరు పరుచగా ఒక్కరోజు సాధారణ జైలు శిక్షతో పాటు రూ 500/- జరిమానా విధించినట్లు తెలిపారు. మరియు ఇంకా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన ' మరో 14 మందికి మెజిస్ట్రేట్ జరిమానా విధించారు. రోడ్డు భద్రత నియమ నిబంధనలకు అనుగుణంగాదవాహనాలను నడుపాలని లేనిచో చట్టరీత్యా కఠినచర్యలు తప్పవని సీఐ పేర్కొన్నారు.

# రాఖీ పాట పోస్టర్ ఆవిష్కరించిన చిట్యాల ఎస్ఐ శ్రావణ్ కుమార్



**చిట్యాల, ఆగస్టు 7 (పీసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో రాఖీ పాట పోస్టర్ ఆవిష్కరణకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన చిట్యాల మండల ఎస్సై శ్రావణ్ కుమార్. పాటను ఆవిష్కరించారు ఎస్సై మాట్లాడుతూ అన్న చెల్లెల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ అని రక్త బంధం కంటే ప్రపంచంలో ఏదీ లేదని సోదర భావంతో కలిగి ఉండాలని ఇలాగే మన సంస్కృతిని కాపాడాలని ప్రతి పండుగకు ప్రత్యేకమైన పాటలు రావాలని అంతరించిపోతున్న కలలను కాపాడాలని పేర్కొన్నారు రాఖీ పాట రచించిన పడిదం రాజేందర్. మరియు కళాకారులను చిట్యాల అంబేద్కర్ చౌరస్తాలో సాల్వతో సత్కరించారు. కళాకారులు మాట్లాడుతూ ఈ పాట ఎం.ఎన్ సాంగ్స్ యూట్యూబ్ ఛానల్లో వీక్షించవచ్చని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో. బిజెపి మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్, నాయకులు గుర్రపు తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, యువజన నాయకులు శరత్ కుమార్,గాయకులు మిద్దెపాక మధు, గాయని జేరిపోతుల సంధ్య, కొరియోగ్రాఫర్ ప్రభాస్, మ్యూజిక్ డైరెక్టర్ సాయికిరణ్,నటులుగా దాసారపు నరేష్, పుల్ల ప్రతాప్, రేణుక, మాధవి మమత ,గాయకులు దూడపాక దివాకర్ తదితరులు పాల్గొన్నారు

# నర్సరీల తనిఖీ చేసిన జిల్లా ఉద్యాన శాఖ అధికారి సునీల్ కుమార్



**చిట్యాల, ఆగస్టు 7 (పీసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని జూకల్ మరియు చల్లగరిగే గ్రామ శివారులలో అనుమతి పొందిన మిరప నర్సరీలను జిల్లా ఉద్యాన శాఖ అధికారి. ఎడ్ల సునీల్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఈ సంవత్సరం 10 మిరప నర్సరీలకు లైసెన్సులు రెన్యూవల్ చేసినట్లు తెలిపారు. లైసెన్సుదారులు నర్సరీ చట్టం ప్రకారం విధిగా నిబంధనలు పాటించాలని, నర్సరీ నిర్వహణలో రిజిస్టర్లు తప్పనిసరిగా నిత్యము అప్డేట్ చేయాల్సిన అవసరం ఉందని చెప్పారునర్సరీ చట్టం ఉల్లంఘిస్తే నర్సరీలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్సుతో కూడిన నర్సరీలపై పర్యవేక్షణ మరింతగా బలపరచనుందని తెలిపారు.

# ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్

- భూ భారతి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలి
- భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై ఆర్డీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష







**హన్మకొండ ఆగస్టు 07 (పిసిడబ్ల్యు న్యూస్):** భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కారానికి చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో భూ భారతి దరఖాస్తుల విచారణ, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఆర్డీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆయా మండలాల తహసీల్దార్లను ఎన్నెన్ని దరఖాస్తులకు ఎన్ని నోటీసులు ఇచ్చారు, ఎన్ని విచారణ చేశారు, ఇప్పటి వరకు ఎన్నింటిని పరిష్కరించారనే వివరాలను, ఒక్క రోజుకు ఎన్ని పరిష్కరిస్తున్నారు అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తులలో విచారణ నిర్వహించి త్వరిత గతిన పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రతి రోజు కనీసం పది దరఖాస్తులపై విచారణ చేయించి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కె. నారాయణ, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# కరీంనగర్ శాసనసభ నియోజకవర్గ ఎన్నికల సమీక్ష సమావేశం...

**- పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నేతలు..**



**కరీంనగర్,ఆగస్టు07(పీసీడబ్ల్యూ న్యూస్):**రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం కరీంనగర్ శాసనసభ నియోజకవర్గ ఎన్నికల సమీక్ష సమావేశం నియోజకవర్గ ఈఆర్వో కరీంనగర్ నగర పాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, రెవెన్యూ డివిజనల్ అధికారి మహేష్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ పార్టీ రాజకీయ పార్టీల నేతలతో సమీక్ష సమావేశం జరిగింది . ఎన్నికల అంశాల గురించి ఈ సమావేశంలో చర్చించారు. కాంగ్రెస్ పార్టీ నుండి మడుపు మోహన్ ,బిజెపి నుండి గుగ్గిలపు రమేష్, నాంపల్లి శ్రీనివాస్, టిఆర్ఎస్ నుండి సత్తినేని శ్రీనివాస్, టిడిపి నుండి కళ్యాడపు ఆగయ్య, సిపిఎం నుండి వాసుదేవరెడ్డి తదితరులు హాజరయ్యారు.

# టాటా గ్రూప్స్ ఆఫ్ కంపెనీ నిర్వహించిన వ్యాసరచన పోటీ




**గంగాధర, ఆగస్టు 7 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో వివేకానంద విద్యాలయం గంగాధరలో టాటా గ్రూప్స్ ఆఫ్ కంపెనీ వారు సెల్ఫ్ రిలాయింట్ ఇండియా అనే అంశంపై వాస్యరచన పోటీ నిర్వహించారు ఈ పోటీలో సుమారు100 మంది విద్యార్థులు పాల్గొన్నారు .వారిలో సీనియర్ విభాగంలో జాశ్విని, మెగవర్శిణి, హర్షవర్ధన్ మరియు జూనియర్ విభాగంలో వరుధిని,సాయిదీక్షిత్,అంజువర్ధన్ విజేతలుగ నిలిచారు విజేతల కు టాటా కంపెనీ వారు గోల్డ్,సిల్వర్,బ్రాంజ్ మెడల్స్ మరియు సర్టిఫికేట్ వివేకానంద విద్యాలయం కరస్పాండెంట్ లక్షారెడ్డి చేతుల మీదిగా అందించారు ఈ కార్యక్రమంలో విద్యార్థిని ,విద్యార్థులు,పాఠశాల డైరెక్టర్ అనంతరెడ్డి,ప్రధానోపాధ్యాయులు నర్సింగరావు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శాలపల్లిలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం...



**హుజూరాబాద్,ఆగస్టు07(పీసీడబ్ల్యూ న్యూస్):** హుజూరాబాద్ మండలం, సాలుపల్లి గ్రామంలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం గ్రామ అధ్యక్షులు వేముల రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రాష్ట్ర పద్మశాలి సంఘం ఆర్గనైజేషన్ సెక్రటరీ సంగెం సత్యనారాయణ మాట్లాడుతూ... చేనేత కార్మికుల జీవితాలు బాగుపడాలని, ప్రజలందరూ చేనేత వస్త్రాలను ధరించాలని ఆకాంక్షించారు. చేనేత కార్మికుల కృషికి తగిన ఫలితం దక్కాలని మార్కండేయ స్వామిని ప్రార్థిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సాలుపల్లి పద్మశాలి కమిటీని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి సంఘం కార్యదర్శి చిలుకమరి శ్రీనివాస్, చెల్పూర్ గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షులు అడెపు సమ్మయ్య, జెడాల చిరంజీవి, జెడాల అశోక్, అడెపు పోచమల్లు, మహిళా నాయకురాలు బింగి రాణి, కూరపాటి రామచంద్రం, గాజంగి అఖిల్ పాల్గొన్నారు.



# చేనేత వస్త్రాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక...

**- చేనేత పరిశ్రమ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక...**

**- తిరంగా అభియాన్ ప్రోగ్రాంను సక్సెస్ చేయాలి...**

**- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డ్ సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర...**



**తిమ్మాపూర్,ఆగస్టు07(పీసీడబ్ల్యూ న్యూస్):**చేనేత వస్త్రాలు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని, చేనేత పరిశ్రమ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక లాంటిదని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు గురువారం రోజున తిమ్మాపూర్ బిజెపి మండల శాఖ,బిజెపి నేత మాజీ జెడ్పిటిసి ల ఆధ్వర్యంలో మండలంలోని పచ్చునూర్, తిమ్మాపూర్ గ్రామంలో నిర్వహించారు. అనంతరం మండల కార్యాశాల, తిరంగా అభియాన్ ప్రోగ్రాం కు సంబంధించిన సన్నాక సమావేశం జరిగింది. ఆయా కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరైన బొంతల కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ భారతదేశంలో చేనేత పరిశ్రమను ప్రోత్సహించడానికి, చేనేత కార్మికులను గౌరవించడానికి ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా 1905 లో బ్రిటిష్ ఉత్పత్తులను బహిష్కరించడం ద్వారా స్వదేశీ ఉద్యమం ప్రారంభమైందన్నారు. ప్రధానంగా ఈ ఉద్యమం దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడం, స్థానిక చేనేత పరిశ్రమను బలోపేతం చేయడం వంటి లక్ష్యాలతో ముందుకు కొనసాగిందన్నారు. భారత్లో చేనేత రంగానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, గ్రామాల్లో వ్యవసాయం తర్వాత అత్యధిక జనాభాకు ఈ రంగమే ఉపాధి కల్పిస్తుందన్నారు. చేనేత పరిశ్రమతో ఎన్నో కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని తెలిపారు. 11 ఏళ్లలో మోడీ ప్రభుత్వం చేనేత రంగ అభివృద్ధి కోసం, కార్మికుల సంక్షేమం కట్టుబడి పని చేస్తుందని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. తిరంగా అభియాన్ ప్రోగ్రామ్ ను సక్సెస్ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూర్ తో దేశ ఖ్యాతినీ విశ్వానికి చాటి చెప్పడం జరిగిందన్నారు. భారతదేశ శక్తి సామర్థ్యాలు నేడు ప్రపంచ దేశాలు గుర్తించాయని, దేశంలో ఉండే కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలకు మాత్రం గుర్తించడం లేదని, ఆపరేషన్ సింధూరపై పనికిమాలిన వ్యాఖ్యలు చేస్తూ దేశాన్ని కించపరిచేలా వ్యవహరించడం దౌర్భాగ్యమన్నారు. బిజెపి నాయకులు కార్యకర్తలు తిరంగా అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా దేశ, త్రివిధ దళాల శక్తిసామర్థ్యాలు, గొప్పతనాన్ని ప్రజలందరికీ వివరించేలా, వాడ వాడలా త్రివర్ణ పతాకం రెపరెపలాడేలా





కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టాలన్నారు. జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా తిమ్మాపూర్, పచ్చునూరు గ్రామాలలో పలువురు చేనేత వృత్తిదారులు, కార్మికులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వర చారి, మాజీ జెడ్పిటిసి ఎడ్ల జోగిరెడ్డి,మాజీ ఎంపీటీసి ఒడ్డె రాజిరెడ్డి, లక్ష్మారెడ్డి,రాష్ట్ర నాయకులు పుప్పాల రఘు, జిల్లా ఈసి సభ్యులు బూట్ల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులు పబ్బ తిరుపతి,తమ్మనవేణి రాజు యాదవ్,బిజెవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శులు బుర్ర శ్రీనివాస్ గౌడ్,కానుగంటి మధుకర్ రెడ్డి,రామిడి మహేందర్ రెడ్డి,ఉప్పులేటి జీవన్,వీణవంక అంజి,ఈగ వెంకటేశం, అందె శేఖర్,చేనేత సంఘం నాయకులు అడిచర్ల రవి, లక్ష్మణ్,పిస్క భూమేష్,రాజ్ కుమార్,బండి స్వామి,కాల్వ శ్రీనివాస్, మల్లేశం గౌడ్,మహేష్,కామెర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ కుమార్ జన్మదిన సందర్భంగా సైకిల్ పంపిణీ



**గంగాధర, ఆగస్టు 7(పీసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని ఘర్షకుర్తి గ్రామంలో కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వర్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు సందర్భంగా ప్రకటించిన సైకిళ్ల పంపిణీ (మోడీ కనుక) కార్యక్రమం ఈరోజు గర్శకుర్తి గ్రామంలో నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శశికాంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాల భూదాత కల్వకోట శ్రీనివాసరావు విద్యా కమిటీ చైర్మన్ శ్రీమతి పొన్నం చందన. గంగాధర మండల బిజెపి అధ్యక్షుడు పంజాల ప్రశాంత్ నియోజకవర్గం కన్వీనర్ పేరుక శ్రావణ్ జిల్లా కోశాధికారి వాయిదా రామానుజం ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దూలం కళ్యాణ్ దళిత మోర్చా జిల్లా అధికార ప్రతినిధి మల్యాల వినయ్ సాగర్ కార్యవర్గ సభ్యులు శ్రీపతి చంద్రశేఖర్ మాజీ అధ్యక్షుడు కొల అశోక్ మాజీ సర్పంచ్ కముటం రాజమల్లయ్య కరీంనగర్ సౌత్ జోన్ ఉపాధ్యక్షుడు కొడిత్యల సురేష్ శక్తి కేంద్రం ఇన్చార్జి ఆంజనేయులు దాసరి బూత్ అధ్యక్షులు కత్తి లక్ష్మణ్ కొలిపాక తిరుపతి రేణికుంట శ్రీనివాస్ రాపాల సుభాష్ గడప రమేష్ మిట్టపల్లి వెంకటేశం నాయకులు రేనికుంట పర్శరం చిందం ఆంజనేయులు దాసరి రాజు గోనెపల్లి మహేందర్ అల్వాల రమేష్ రేణికుంట రమేష్ మరియు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది



# ఢిల్లీలో కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రిని కలిసిన సుడా చైర్మన్...





**న్యూఢిల్లీ,ఆగస్టు(పీసీడబ్ల్యూ న్యూస్):**కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కుంజారపు రామ్మోహన్ నాయుడును ఢిల్లీలోని రాజ్ భవన్ మంత్రిత్వ కార్యాలయంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కలిశారు.ఈ సందర్భంగా మంత్రిని నరేందర్ రెడ్డి ఉమ్మడి జిల్లా కేంద్రమైన కరీంనగర్ సమీపంలో విమానాశ్రయం ఏర్పాటుకు సర్వే జరిపి నిధులు మంజూరు చేయాలని కోరారు. గతంలో సర్వే చేయడం జరిగిందని ఆది కార్యరూపం దాల్చలేదని కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అనేక మంది దేశ విదేశాలలో నివసిస్తున్నారని అంతే కాకుండా గ్రానైట్ పరిశ్రమ విస్తరించి ఉండడం వల్ల వ్యాపారకార్య కలపాలకు అనుకూలంగా ఉంటుందని పరిశించవలసిందిగా నరేందర్ రెడ్డి కేంద్ర మంత్రిని కోరినట్టు తెలిపారు.మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో ఒక అధికార బృందాన్ని పంపిస్తామని విమానాశ్రయానికి అనుకూలమైన ప్రదేశాలను చూపించాల్సిందిగా నరేందర్ రెడ్డి కి సూచించినట్టు పేర్కొన్నారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో నరేందర్ రెడ్డి తో పాటు కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి కూడా ఉన్నారు.

# కేంద్రం ఇస్తున్న నిధులతోనే ఇందిరమ్మ ఇండ్లు

**అధికారులారా తప్పుడు ప్రచారం సమాచారం ఇవ్వొద్దు**

**తిమ్మాపూర్ మండల బీజేపీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి**



**తిమ్మాపూర్ , ఆగస్టు 07(పీసీడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** కేంద్రం లోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతుందని తిమ్మాపూర్ మండల బీజేపీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి పేర్కొన్నారు. సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వచ్చునూర్ గ్రామం లో మండల కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు.కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధుల మంజూరు గురించి లబ్ధిదారులకు సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించారు.ఈ విషయం పై అధికారులు కూడా గొప్యత ప్రదర్శించడం నేరపూరిత చర్య క్రిందికే వస్తుందని అన్నారు.దయచేసి తప్పుడు సమాచారం ఇవ్వొద్దని కోరారు. ఇండ్లు మంజూరు చేస్తున్నటువంటి విషయం లో నామ మాత్రంగా ఉత్తర్వుల కాగితాలు ఇస్తున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో అధికారులు చరవాణి లో మాత్రం పిఎంఏ వై పథకానికి సంబంధించిన ఆప్ లో వివరాలు నమోదు చేస్తున్న విషయం లబ్ధిదారులు గమనిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలో వాటి విషయాలన్నీ బయటపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వ దొంగ ప్రచారాలను అడ్డుకుంటామని అన్నారు.అర్హులైన వారందరికీ ఇండ్లు ఇస్తామని చెప్పి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో మందికి ఎగనామం పెట్టిందని ఆరోపించారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికీ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేసారు.

# హుజురాబాద్‌లో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ...



**హుజురాబాద్,ఆగస్టు07(పీసీడబ్ల్యూ న్యూస్):** గొప్ప సామాజిక కార్యకర్త, స్వాతంత్ర్య పోరాట వీరుడు, మాజీ ఉప ప్రధాని అయిన డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని హుజురాబాద్‌లోని సైదాపూర్ రహదారి సమీపంలో ఆవిష్కరించారు. జయన్న సంస్థాపక అధ్యక్షురాలు గుడిపాటి సరిత జయపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంద కృష్ణ మాదిగ, తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ ఒక స్వాతంత్ర్య సమరయోధుడిగా, సమాజ సేవకుడిగా దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోతుందని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్‌ల కృషి వల్లే దేశం లౌకికత్వం, సమానత్వం వైపు పయనిస్తోందని అన్నారు.జయన్న సంస్థ అధ్యక్షురాలు గుడిపాటి సరిత జయపాల్ రెడ్డి మాట్లాడుతూ, జగ్జీవన్‌రామ్ పాలనా దక్షత, ప్రజల పట్ల అపారమైన ప్రేమ, స్వార్థం లేని సేవలతో తిరుగులేని నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. దళితులు, వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ఆయన జీవితం ఒక గొప్ప ప్రేరణ అని ఆమె అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఉత్తమ శాసనసభ్యుడిగా, కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా అనేక పదవులు నిర్వహించి దేశానికి ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు.ఎస్సీ రాష్ట్ర నాయకులు దయాకర్, సామాజిక కార్యకర్త రవీంద్ర రావుతో పాటు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుల పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యపు వైఖరిని నిరసిస్తూ
# బిఆర్ఎస్ పార్టీ మోగించిన జంగ్ సైరన్

**● రైతు రక్షణ - బీఆర్ఎస్ లక్ష్యం ● హరీష్ రావు నేతృత్వంలో రైతు మహాధర్నా ● పాల్గొన్న ఉమ్మడి మెదక్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ● పాల్గొన్న పటాన్ చెరువు నియోజకవర్గ యువ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్.**

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై చేస్తున్న అవమానాలు, నిర్లక్ష్యం, మోసాలపై బీఆర్ఎస్ పార్టీ సున్నితంగా స్పందించకుండా,గట్టిగా నిరసన తెలుపుతోంది.తొలగించబడిన బోనస్ పథకాలు,అసంపూర్ణ రుణమాఫీ, రైతు భరోసాలో కోతలు,రైతులపై మోపిన భారాలు ఇవన్నీ తెలంగాణ రైతాంగాన్ని తీవ్రంగా కోలుకోలేని దెబ్బతీశాయి. దీంతో, రైతుల గోడులు ప్రభుత్వానికి వినిపించేలా, బీఆర్ఎస్ నేతృత్వంలో మహాధర్నా నిర్వహించారు.తెలంగాణ రైతుకు నిజమైన మిత్రుడు,శ్రేయోభిలాషి అయిన హరీష్ రావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, రైతుల హక్కుల కోసం గొంతెత్తారు. ఆయన మాట్లాడుతూ రైతన్నను మోసం చేసిన ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన సమయం ఇది. రైతు పై మోసం జరిగితే, రాష్ట్రం నష్టపోతుంది, అని అన్నారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వం



హయాంలో రైతులకు అమలు చేసిన ముఖ్యమైన సంక్షేమపథకాలు రైతుబంధు,ప్రతి సీజన్‌కు రూ.5,000 ఎకరాకు, ఏటా రూ.10,000 నేరుగా రైతు ఖాతాలో జమ,రైతు బీమా,ఒక్క రైతు మృతి చెందితే ఆయన కుటుంబానికి ?5 లక్షల బీమా రక్షణ,మిషన్ కాకతీయ,చెరువుల పునరుద్ధరణ ద్వారా నీటి నిల్వలు పెంపు,మిషన్ భగీరథ,సాగు నీటి కోసం ఇంటింటికీ మంచినీటి సరఫరా,కాళేశ్వరం ప్రాజెక్ట్,ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం ద్వారా లక్షల ఎకరాలకు సాగునీటి లబ్ధి,24 గంటల ఉచిత విద్యుత్,దేశంలోనే తొలి రాష్ట్రంగా నిరంతర విద్యుత్,కృషి సంక్షేమ బోర్డు,రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన



బోర్డు, బి ఆర్ ఎస్ పార్టీ రైతుల వెంటే నిలబడుతుంది.ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో రైతులు మరల పడిపోతున్నారు. నాటి రోజుల కంటే దారుణంగా. హామీలు ఇచ్చి మోసం చేస్తున్నారు. దీనిపై బీఆర్ఎస్ ఉద్యమాన్ని మళ్లీ ప్రారంభించింది.హరీష్ రావు నాయకత్వంలో రైతుల గళానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుంది.రైతన్నలందరికీ పిలుపు ఏమిటంటే మీ హక్కుల కోసం,మీ న్యాయం కోసం ఈ మహాధర్నాలో భాగస్వాములమవుదాము.

## వీరభద్ర స్వామి ఆలయ గోపురం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి వీరభద్ర స్వామి దేవాలయం ఆవరణలో 8 కోట్ల నలభై లక్షల రూపాయల అంచనా వ్యయంతో 140 ఫీట్ల పొడవుతో 9 అంతస్తుల నిర్మాణంతో చేపట్టనున్న ఆలయ ముఖ రాజగోపురం నిర్మాణ పనులకు గురువారం ఉదయం శంకుస్థాపన చేసిన పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి.రాష్ట్రంలోనే ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న బొంతపల్లి వీరభద్ర స్వామి దేవాలయం అభివృద్ధికి ఒక భక్తుడిగా అనునిత్యం సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు.గతంలోనే ఆలయం చుట్టూ రాజప్రకారాలు నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు.భవిష్యత్తులోనూ ఆలయ అభివృద్ధికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

# పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ అమానుష దాడి

**● దాడిని ఖండిస్తూ భారీ స్థాయిలో సంఘీభావ ర్యాలీ ● పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ఖమ్మం నగరంలో పెవిలియన్ గ్రౌండ్ నుండి జడ్పీ సెంటర్ అంబేద్కర్ చౌరస్తా వరకు వేలాదిమంది ప్రజలు సంఘీభావ ర్యాలీ**

**ఖమ్మం, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** పాలస్తీనా ప్రజలకు ఆహారం, నీరు, వెళ్లకుండా అడ్డుకుంటూ వేలాదిమంది ప్రజల ఆకలి చావులకు కారణమవుతున్న ఇజ్రాయిల్ అమానుష దాడిని నిరసిస్తూ గురువారం ప్రజాస్వామ్యక వాదులు, మేధావులు వివిధ పార్టీల నాయకులు, జర్నలిస్టులు, విద్యార్థులు, మహిళలు, ఖమ్మం ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సంఘీభావ ర్యాలీలో సిపిఐ జాతీయ నాయకులు అజీజ్ పాషా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి గోకనపల్లి వెంకటేశ్వర్లు, న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు మధు జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఖమర్, కాంగ్రెస్ కిసాన్ జిల్లా అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్, మైనార్టీ సెల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహ్మద్ హుస్సేన్, జమాతే ఇస్లామిక్ నాయకులు జైనుల్ పాషా, మహమ్మద్ ఇలియాస్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, పాలస్తీనా సంఘీభావ కమిటీ



నాయకులు రవి మారుత్, కాకి భాస్కర్, మువ్వ శ్రీనివాస్, ఐవి రమణారావు, దేవిరెడ్డి విజయ్, బండారు రమేష్, మనోహర్ రాజు, డాక్టర్స్ ఎం.ఎఫ్ గోపీనాథ్, రవీంద్రనాథ్ లు ఈ సందర్భంగా మాట్లాడుతూ... పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న ఈ దాడుల మూలంగా గాజాలో ప్రజలకు నీరు,ఆహారం, మందులు, నిత్యవసర, సరుకులు, విద్యుత్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అన్నారు. చదువుకోవడానికి పాఠశాలలు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ఆసుపత్రులను ప్రజలకు అందకుండా ధ్వంసం చేస్తున్నారు. ఇప్పటికీ గాజాలోని 20 లక్షల మంది ప్రజలు దుర్భిద్య మైన జీవనం గడుపుతున్నారు. వేలాదిమంది ప్రజలు, పసిపిల్లలు, మహిళలు, వృద్ధులు మరణించారని, అక్కడి ప్రజలకు ఆహారం అందించకుండా ఇజ్రాయిల్ ఆంక్షలు విధించి బాంబులతో రాకెట్ దాడులు చేస్తూ ఉండడం వలన ఆహారం అందకపోవడం వల్ల తమ ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. అక్కడి ప్రజలు నిరంతరం ఆక్రమణలు, ఆంక్షలు, దాడులను ఎదుర్కొంటున్నారు. గాజాకు పేరుకు స్వేచ్ఛ ఇచ్చినట్లు ఇచ్చి భూమి సముద్రం గగనతలంపై లెక్కలేనన్ని ఆంక్షలు విధించి అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పాలస్తీనా ప్రజలకు మద్దతుగా ఈ ర్యాలీలో న్యాయవాదులు తిరుమలరావు, శేషగిరి, విప్లవ కుమార్, సుగుణరావు, జక్కంపూడి నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ విద్యార్థి సంఘాల నాయకులు రామకృష్ణ, ప్రవీణ్, వెంకటేష్ మస్తాన్ సురేష్, యువజన సంఘాల నాయకులు బషీర్, రామకృష్ణ, రాకేష్, రమేష్, మహిళా సంఘం నాయకులు బండి పద్మ, పోటు కళావతి, ఝాన్సీ, లక్ష్మి, జర్నలిస్టు సంఘాల నాయకులు ఆదినారాయణ, ఏనుగు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్, బాబుఖదీర్, చిత్ర రవి, సయ్యద్ కాశ్మీ, జలాలుద్దీన్ కాశ్మీ, ప్రసేన్, సీతారాం, అశోక్ తో పాటు వేలాదిమంది విద్యార్థులు ప్రజలు ప్రజాస్వామికవాదులు, మేధావులు, కవులు, కళాకారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల నాయకులు, వివిధ పాఠశాలల, కళాశాల యాజమాన్యాలు తదితరులు పాల్గొన్నారు.


## కూరగాయల వ్యాపారస్తుల ఆవేదనను పట్టించుకోని మున్సిపల్ అధికారులు..



**కరీంనగర్ టౌన్, ఆగస్టు 07(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లాలో గురువారం రోజున అశోక్‌నగర్ డివిజన్ లోని వీక్లీ మార్కెట్ నందు కూరగాయలు అమ్మే వ్యాపారస్తులకు ఎటువంటి ముందు హెచ్చరికలు ఇవ్వకుండా విధి వ్యాపారస్తుల యొక్క సామాగ్రిని మున్సిపల్ అధికారులు తీసుకొని వెళ్ళడం వల్ల కూరగాయల వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేశారు,వ్యాపారస్తులు మాట్లాడుతూ.. తాము బయట వ్యాపారాలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందనీ అంటున్నారని, మూగజీవులు రోడ్డుమీద సంచరించడం వల్ల ట్రాఫిక్ అంతరాయం కలగడం కనిపించడం లేదని చెప్పారు, అశోక్ నగర్ లోని రైతు మార్కెట్ లోపల ఎటువంటి సౌకర్యాలు గానీ వసతులు గానీ లేక పోవడం వల్ల బయటకు వచ్చి కూరగాయలు విక్రయిస్తున్నమని అన్నారు, అనంతరం అధికారులు స్పందించి మార్కెట్ లోపల ఇరవైనాలుగు గంటలూ మంచినీటి సౌకర్యం ఉండేటట్లు, ఎప్పటికప్పుడు చెత్త సేకరించాలని, డ్రెయినేజీ మురికి నుండి వచ్చే దుర్వాసనను అరికట్టాలని, ఈ సమస్యలను పరిష్కరిస్తే మార్కెట్ లోపల వ్యాపారాలను నిర్వహిస్తామని చెప్పారు.

## బాధితుడికి ప్రాణహాని ... న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం: బాధితుడు సురేష్ హెచ్చరిక...

**హుజురాబాద్/జమ్మికుంట, ఆగస్టు07(పీసీడబ్ల్యూ న్యూస్):** భూ కబ్జాదారుల నుండి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని, తన సమస్యను పరిష్కరించకుంటే ఆత్మహత్యే శరణ్యమని జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని రామన్నపల్లెకు చెందిన పురేళ్ల సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి నిర్మాణం అడ్డుకుంటున్న కబ్జాదారులకు స్థానిక రాజకీయ నాయకులు, పోలీసుల అండ ఉందని ఆయన ఆరోపించారు. ఈ విషయమై హుజురాబాద్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన తన గోడు వెళ్లబోసుకున్నారు.సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... 2012లో సురేష్ తండ్రి పురేళ్ల భద్రయ్య, పెదనాన్న పురేళ్ల రాజయ్య వద్ద మూడు గుంటల భూమిని కొనుగోలు చేశారు. ఈ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, నాలా కన్వర్షన్, మున్సిపల్ అనుమతి, రెవెన్యూ పత్రాలు అన్నీ తమ పేరు మీద ఉన్నాయని సురేష్ చెప్పారు. అయితే, కౌటం ప్రమీల, పార్వతి సుమన్ అనే వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి తమ ఇంటి నిర్మాణం అడ్డుకుంటున్నారని ఆరోపించారు.ఈ సమస్యపై జమ్మికుంట సీఐ రామకృష్ణ గౌడ్‌కి నాలుగు సార్లు ఫిర్యాదు చేసినా, అది సివిల్ తగాదా అని చెప్పి తమ దరఖాస్తును పట్టించుకోలేదని సురేష్ వాపోయారు. సీపీకి ఫిర్యాదు చేసినా, సీఐ తప్పుడు సమాచారం ఇచ్చి, తమ ప్రత్యర్థులతో తమపైనే తప్పుడు కేసు పెట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. దీంతో హ్యూమన్ రైట్స్ కమిషన్‌ను ఆశ్రయించగా, సీఐపై విచారణకు ఆదేశాలు జారీ చేసినట్లు సురేష్ వెల్లడించారు. తనకు, తన కుటుంబానికి న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమని ఆయన హెచ్చరించారు.




## ఆడపిల్లలకు రక్షణగా పోలీసు వ్యవస్థ ముందు ఉంటుంది


**● విద్యార్థులు స్నేహ భావంతో మెలగాలి: ఎస్ఐ నాగరాజు**
**● ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్షాబంధన్**




**రామన్నపేట ఆగస్టు07(పీసీడబ్ల్యూ న్యూస్):** విద్యార్థినిలపై ఈవిటీజింగ్, ర్యాగింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని విద్యార్థులు స్నేహభావంతో ముందుకు పోవాలని స్థానిక ఎస్ఐ నాగరాజు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థినీలతో స్థానిక ఎస్సై పోలీస్ స్టేషన్ సిబ్బందికి రాఖీలు కట్టి రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ ఆడపిల్లలకు రక్షణగా పోలీస్ సిబ్బంది ఎల్లవేళలా ముందు ఉంటుందని విద్యార్థి నీల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఈవిటీజింగ్ ర్యాగింగ్ భూపాల్ పాడిన కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆడపిల్లలు ధైర్యంగా అన్ని రంగాల్లో ముందుకు పోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్, డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు శనగొండ రాము శ్రీను సంతోష్ నవదీప్ కార్తీక్ అక్షిత అలేఖ్య తేజశ్రీ హారిక అనుప్రియ శ్రేష్ఠ శివాని తదితరులు పాల్గొన్నారు




## విధులకు డుమ్మా కొట్టి తాగి తందనాలు ఆడుతున్న విద్యుత్ అధికారులు



**యాదాద్రి ఆగస్టు 07(పిసిడబ్ల్యూ న్యూస్):** యాదాద్రి ఆత్మకూరు(ఎం), మోత్కూర్, గుండాల మండలాల విద్యుత్ ఏఈలు,మోత్కూర్ ఎడిఈ తో పాటు ఇతర అధికారులు గురువారం రోజు విధులకు డుమ్మా కొట్టి చౌటుప్పల్ దగ్గరలోని సరళ మైసమ్మ దేవాలయం వద్ద విందులో పాల్గొన్నారు.విద్యుత్ కాంట్రాక్టర్లు ఈ విందును ఏర్పాటు చేశారు.కార్యాలయంలో మాత్రం భువనగిరిలో మీటింగ్ ఉంది అని చెప్పినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. భువనగిరి ఎస్ ఇ కార్యాలయంలో సంప్రదిస్తే ఎలాంటి మీటింగ్ లేదని తెలిపారు .



# గ్రామీణ వైద్యులపై టీజీఎంసీ దాడులను ఖండించండి

**• గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు**

**• ఉమ్మడి జిల్లా జనరల్ బాడీ సమావేశంలో సీజనల్ వ్యాధులపై అవగాహన**

**ఖమ్మం, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా ఆరోగ్యాన్ని కాపాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాటుపడుతున్న గ్రామీణ వైద్యులపై టీజీఎంసీ చేస్తున్న దాడులను ఖండించాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు అన్నారు. గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశం గురువారం ఖమ్మం రూరల్ మండలంలోని మారెమ్మ గుడి వద్ద, దుశ్యంతరెడ్డి ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు పిట్టల నాగేశ్వరరావు, అనంతారపు



వెంకటాచారి లు మాట్లాడుతూ... వైద్యాన్ని ప్రజల దగ్గరకు తీసుకువెళ్లి, ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు, సూచనలు చేసి ఫస్ట్ ఎయిడ్ పరీక్షలు నిర్వహించి వారికి వెన్నుదన్నుగా, అండగా ఉంటున్న గ్రామీణ వైద్యులు నేడు సమాజానికి ఎంతో అవసరం అన్నారు. అందుకే దేశంలో అన్ని ఉద్యమాలు వచ్చాయి కానీ వైద్య ఉద్యమం రాకపోవడానికి కారణం గ్రామీణ వైద్యులే అన్నారు. ఉమ్మడి జిల్లా నుండి వచ్చిన గ్రామీణ వైద్యులకు సీజనల్ వ్యాధులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఈ సందర్భంగా నిర్వహించారు. గ్రామీణ వైద్యులకు గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చిన జీవో 429, 428, 1273 లను పునరుద్ధరించాలని, గ్రామీణ వైద్యులకు పారామెడికల్ శిక్షణను ఇప్పించి చట్టబద్ధత కల్పించాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసారు. అదేవిధంగా గ్రామీణ వైద్యులపై టిజిఎంసి దాడులను ఖండిస్తూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ మణికుమార్, ఎన్ సుదర్శన్, జి వెంకటరామయ్య, కార్యదర్శి ఇంటూరి నాగరాజు, ప్రచార కార్యదర్శి బి కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శులు చంద్రారెడ్డి, టి రాము, కె. రాములు, యల్. శ్రీనివాసరావు, జి. వెంకటేశ్వర్లు, దాసరి శ్రీనివాసరావు, షేక్ హుస్సేన్ మియా, రాయల శ్రీనివాసరావు, ఎండి మహమ్మద్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాలు ఎవరెస్ట్ స్థాయికి ఎదిగాయి

**• ఆరు లక్షల మంది విద్యార్థులకు ఆశ్రమం**

**• పేరెంట్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా నూతన కమిటీ ఎన్నిక • తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోట లోకేష్**

**ఖమ్మం, ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు,ఇంటర్,డిగ్రీ కళాశాల లు ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రభుత్వం ,నేడు గురుకులాలు ఎవరెస్ట్ స్థాయికి చేరుకున్నాయని , దాదాపు 6 లక్షల మంది విద్యార్థులకు ఆశ్రమం కల్పిస్తూ బావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నాయని తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోట లోకేష్ అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి కేవలం 293 గురుకుల పాఠశాలలు ఉండగా, నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం




తొమ్మిదేండ్లలో 709 కి పైగా కొత్త గురుకుల పాఠశాలలు కొన్ని ఇంటర్,డిగ్రీ కాలేజీలు ప్రారంభించడం జరిగింది అన్నారు.మొత్తం వెయ్యికి పైగా గురుకులాల్లో సుమారు ఆరు లక్షల మంది విద్యార్థులకు అధునాతన సౌకర్యాలతో నాణ్యమైన ఉచిత విద్యా బోధనతో పాటు భోజన, వసతి సదుపాయలు కల్పిస్తుదని, ఐఐటీ,ఐఐఎం,నీట్,దేశ విదేశాలలో క్యాట్,మ్యాట్,సాయుధబలగల పరీక్షలలో శిక్షణ నిస్తూ,కంప్యూటింగ్ కోడింగ్, డేటా సైన్స్, మేషన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి వాటిలో గురుకులాలు ప్రత్యేక శిక్షణనిస్తున్నాయని అన్నారు. టి జి పి ఎ వ్యవస్థాపక అధ్యక్షులు మోతుకూరి యాదయ్య ,తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అంబాల ప్రభాకర్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడిసె పవన్ కుమార్‌సారథ్యంలో అసోసియేషన్ కొనసాగుతున్నాయని, అందులో భాగంగాతెలంగాణ గురుకులాలు పేరెంట్స్ అసోషియేషన్ ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికైన కమిటీ సభ్యులను అభినందిస్తూ వారికి నియమక పత్రాలను ఈ సందర్భంగా అందజేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జీ పరకాల విజయ కుమారి, ఖమ్మం జిల్లా అధ్యక్షులు గొల్లమందల శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి మతంగి అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు ముత్యాల.రాజు,సహాయ కార్యదర్శి కొల్లి.వర్మ, ప్రచార కార్యదర్శి దర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు వెళ్తున్న బాలికను ఢీకొన్న ద్విచక్రవాహనం

**- పావనికి తీవ్ర గాయాలు**

**- పిడిఎస్యు నేత బానోత్ దేవేందర్ పరామర్శ**

**మహబూబాబాద్ జిల్లా, కురవి ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** పాఠశాల బాటలో బాలికపై విషాదం అలుముకుంది. బంచరాయితండ ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం చేసేందుకు ప్రతినిత్యం మెయిన్ రోడ్డునుంచి పాఠశాల దాకా నడుచుకుంటూ వెళ్లే మూడ్ పావని అనే చిన్నారి విద్యార్థిని, ఈ ఉదయం ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. వివరాల్లోకి వెళితే, బయ్యారం నుండి మహబూబాబాద్ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం (ఆర్ వన్ ఫైవ్ – నంబర్ TS 28 K 7931) అదుపు తప్పి, పాఠశాలకు నడుచు కుంటూ వెళ్తున్న పావనిని ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో పావనికి ఎడమ కాలు విరిగింది. అంతేగాక తల భాగంలో తీవ్ర గాయాలు తలెత్తాయి. ఘటనను గుర్తించిన స్థానికులు, తల్లిదండ్రులు వెంటనే స్పందించి ఆమెను మహబూబాబాద్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పావనికి ప్రాథమిక చికిత్స అనంతరం ఎక్స్‌రే నివేదికలో ఎడమ కాలు పూర్తిగా విరిగినట్టు వైద్యులు నిర్ధారించారు. వెంటనే సిమెంట్ ప్లాస్టర్ వేసి శస్త్ర చికిత్స అవసరమై ఉంటే తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు వైద్య సిబ్బంది



తెలిపారు. తల గాయాల పరిణామాలను గమనించేందుకు స్కానింగ్ కూడా చేసినట్లు సమాచారం. ఈ ప్రమాద వార్త తెలిసిన వెంటనే పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్, హాస్పిటల్‌కు చేరుకొని బాధిత బాలికను పరామర్శించారు. తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. చిన్నారి పావనికి అన్ని రకాల వైద్య సేవలు అందేలా చూడాలని వైద్య సిబ్బందిని కోరారు. తానే దగ్గరుండి ఆమెకు కాళ్లకు సిమెంట్ ప్లాస్టర్ వేయించేందుకు ఏర్పాట్లు చేసి, నాణ్యమైన చికిత్స కోసం ప్రత్యేకంగా ప్రయత్నించానని తెలిపారు. దేవేందర్ మాట్లాడుతూ "ఇది ఒక నిర్లక్ష్య డ్రైవింగ్ మూలంగా చిన్నారి జీవితంపై తీవ్ర ప్రభావం చూపించిన ఘటన. రోడ్లపై ఓవరుస్పీడ్, అప్రమత్తత లేకపోవడం వంటి కారణాలతో ఇలా చిన్నారులు నష్టపోవడం బాధాకరం. బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరతాం. గ్రామంలో స్కూల్‌కి వెళ్లే చిన్నారులకు వేరే పాథ్‌వే లేకుండా బస్సు, బైక్‌ల రద్దీ మధ్య నడవాల్సి రావడమే ఈ ప్రమాదాలకు మూలం. అధికారులం వీటిపై వెంటనే స్పందించాలి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకొని స్థానికులు, విద్యార్థి సంఘాలు, గ్రామ పెద్దలు రహదారి పక్కన పాదచారుల భద్రత కోసం ఫుట్‌పాత్ ఏర్పాటు చేయాలని, స్కూల్ సమీపంలో నెమ్మదిగా వెళ్లాలని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఒక పాఠశాల బాటలో ఈ చిన్నారి పడిన గాయం రేపటి రోజుల్లో ఇంకా ఎవరైనా ఈ విధంగా ప్రమాదానికి గురవకుండా ఉండాలంటే, ఇది ఒక హెచ్చరికగా మారాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# అంగన్వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు

**• బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు ఇవ్వాలి • తల్లిపాలు శిశుకు ప్రకృతి సహజ సిద్ధమైనవి సురక్షితమైనవి పోష్టికరమైనవి**

**• ఐసిడిస్ సూపర్వైజర్ ఎం.రమణ**

**మహబూబాబాద్ జిల్లా కురవి ఆగస్టు 7 (పీసిడబ్ల్యూ న్యూస్):** మేజర్ గ్రామ పంచాయతీలో 6 అంగన్వాడీ సెంటర్ ఏడబ్ల్యూసి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ఘనంగా నిర్వహించడం జరిగింది.అనంతరం పిల్లలతో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించిన్నారు.తల్లిబిడ్డ రూపాన్ని రంగురంగుల ముగ్గులతో చిత్రికరించి వేయడం జరిగింది.ఈ సందర్భంగా ఐసిడిస్ సూపర్వైజర్ ఎం.రమణ మాట్లాడుతూ..తల్లిపాలు శిశుకు ప్రకృతి సహజ సిద్ధమైనవి సురక్షితమైనవి పోష్టికరమైనవే కాక సంపూర్ణ ఆహారం అమృత తుల్యమైన ఆంటీ బాడీస్ పనిచేసే శిశువుకు అన్ని రోగాలను నుండి పోరాడే శక్తినిఇస్తుందన్నారు.ముర్రుపాలులలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుంది,మెదడు చురుగ్గా పనిచేస్తుంది,బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు ఇవ్వాలి,తల్లిపాల సులభంగా జీర్ణమై బిడ్డకు చక్కటి శారీరక మానసిక సాంఘిక ఆరోగ్య అభివృద్ధి తల్లి పాలు గట్టి పునాదులు వేస్తుందని అన్నారు.తల్లి శరీరంలోని ప్రమాదకర బ్యాక్టీరియా బిడ్డ శరీరంలోకి చేరిన కీడు చేయకుండా తల్లిపాలు నిరోధిస్తాయని తెలిపారు.తల్లిపాలలో ఉన్న ప్రోటీన్స్ ఫ్యాట్ కాలుష్యం తొందరగా గ్రహించబడి శిష్యులను విరోచనాలు నిమోనియా నుండి రక్షిస్తాయని వివరించారు.సంపూర్ణ మానసిక వికాసానికి గాను రెండేళ్ల వయసు వచ్చే వరకుపిల్లలకు తల్లిపాలు తాగించాలి,చిన్నారుల తల్లిదండ్రులు క్రమంగా తప్పకుండా పాలు పట్టించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏడబ్ల్యుటీ, ఎస్.ఉమా, అరుణ,భద్రకాళి, జ్యోతి,శ్రీలక్ష్మి, సుజాత,కవిత, వసంత,ఆశ వర్కర్,పిల్లలతల్లులు పాల్గొన్నారు.



## తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం: డాక్టర్ రమ్య



**నరసింహుల పేట ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధి కారి డాక్టర్ రమ్య నరసింహులపేటలోని స్థానిక అంగన్వాడీ సెంటర్ సమావేశంలో తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా తల్లిపాల విశిష్టత గురించి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అర్ధగంటలోపే తల్లిపాలు పట్టించాలని ఆపాలు బిడ్డకి అన్ని రకాల వ్యాధుల నుండి రక్షణ కవచముగా తోడ్పడునని వైద్యాధి కారి రమ్య అన్నారుగర్భిణీ స్త్రీలకు మరియు చిన్న పిల్లల తల్లులకి అంగన్వాడీ టీచర్లకి వైద్య సిబ్బందికి ఆయాలకు తెలియజేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ లలిత నిర్మల స్రవంతి శ్రావణి . సువాసిని. విమల. రమ ఏఎన్ఎం ప్రసన్నకుమారి కృష్ణవేణి. తోపాటుతదితరులు పాల్గొన్నారు

## ఘనంగా బోనాల పండుగ



**రామన్నపేట ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామన్నపేట మండలం పరిసర గ్రామాల్లో బోనాల పండుగ ఘనంగా జరిగినది రామన్నపేట మండల కేంద్రంలో బీసీ కాలనీలో బోనాల పండుగ ఘనంగా జరిగినది ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు అమ్మవారికి తమ యొక్క మొక్కులను చెల్లించినారు

## సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

**- మండల వ్యవసాయ అధికారి వీరా సింగ్**

**మరిపెడ ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** మరిపెడ మండలం 2025-26 సంవత్సరం గాను సబ్సిడీ పై వ్యవసాయ పనిముట్లు రైతులకు సబ్సిడీ లో కలవు దీనిలో మరిపెడ మండలానికి 26 పవర్ స్ప్రేయర్ (పెట్రోల్ పంపు )11 ట్రాక్టర్ రోటోవేటర్ మొదటి విడతగా మండలానికి కేటాంచడం జరిగింది.సబ్సిడీ వివరాలు సన్న, చిన్న కారు మరియు ఎస్టి, ఎస్సీ, జనరల్ మహిళా, రైతులకు 50% సబ్సిడీ ఇతర పెద్ద రైతులకు 40%సబ్సిడీ వర్తించును కావలసినవారు మీ వ్యవసాయా విస్తీరణ అధికారి (ఏ ఈ ఓ) వద్ద అప్లికేషన్ చేసుకో గలరు రైతు డాకుమెంట్స్అప్లికేషన్ ఫార్మ్, ఫోటోస్-పాసుపోర్టు సైజు 1.పట్టా పాసుబుక్ జిరాక్స్2.ఆధార్ కార్డు జిరాక్స్3.బ్యాంకు అకౌంట్ జిరాక్స్4.రోటోవేటర్ కి ట్రాక్టర్ రేషన్ కార్డు జిరాక్స్ తో వ్యవసాయ విస్తీరణ అధికారి కి సంప్రదించండి.

## గౌడ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక



**మరిపెడ ఆగస్టు 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** గౌడ యువజన విభాగం మరిపెడ మండల కమిటీని ఎన్నిక జిల్లా గౌడ బాధ్యులు లింగాల.మహేష్ గౌడ్, గంధసిరి.కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిళ ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు బండి.దీపక్ గౌడ్ పాల్గొని మండల కమిటీని ప్రకటించారు.మరిపెడ మండల కమిటీఅధ్యక్షులు గా గుండగాని.రంగనాథ్ గౌడ్ ప్రధాన కార్యదర్శి గా గండి.భార్గవ్ గౌడ్ ఉపాధ్యక్షులు గా సోమగాని.సాయి కుమార్ గౌడ్ కార్యదర్శిగా తండ.సతీష్ గౌడ్ సహయ కార్యదర్శి గా గాదెగాని.నరేష్ గౌడ్ కోశాధికారి గా రాంపల్లి.రంజీత్ గౌడ్ కార్యదర్శులు గా గంధసిరి.వేణు గౌడ్ ,సందీప్ గౌడ్,అశోక్ గౌడ్,అవినాష్ గౌడ్ లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మరిపెడ పట్టణ కమిటీఅధ్యక్షులు గా గుండగాని.నరేష్ గౌడ్ ప్రధాన కార్యదర్శి గా వినోద్ గౌడ్ ఉపాధ్యక్షులు గా మహేష్ గౌడ్ కార్యదర్శి గా రాజశేఖర్ గౌడ్ ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.జిల్లా గౌడ నాయకులు బోడపట్ల.సతీష్ రాంపల్లి.కపిల్,బోడపట్ల ఉప్పలయ్య పాల్గొన్నారు

# జిహెచ్ఎంసి కమిషనర్ నిర్లక్ష్యం

**టౌన్ ప్లానింగ్ ఏసీపీల అవినీతి రాజ్యం**

**ఏసీపీలపై ఫిర్యాదు చేసిన పట్టించుకోని కమిషనర్ కర్ణన్**

**మొన్న బేగంపేట సర్కిల్ ఏసిపి సుస్మిత, నేడు జూబ్లీహిల్స్ సర్కిల్ ఏసిపి ఇంజా శ్రీనివాస్**

**టౌన్ ప్లానింగ్ ఏసిపి ఇంజ శ్రీనివాస్ పై ఫిర్యాదు చేసిన చర్యలకు జంకుతున్న కమిషనర్**

**అక్రమ నిర్మాణాల అవినీతిలో టౌన్ ప్లానింగ్ అధికారుల భాగస్వామ్యం ఉందా.?**

**అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేసిన ఎందుకు చర్యలు తీసుకోరు.?**


**కాసులు కనబడితే అక్రమ నిర్మాణాలు కనపడవా.?**

**టౌన్ ప్లానింగ్ అధికారుల అక్రమ ఆదాయంపై ఏసీబీ ఎంక్వయిరీ చెయ్యాలి**

**కోట్లలో అవినీతి చేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులు పట్టించుకోని ప్రభుత్వం**

**జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో అధికారులకు నెలనెల మామూలు ఇస్తున్న సర్కిల్ ఏసీపిలు.?**







**హైదరాబాద్,ఆగస్టు 7 (పీసిడబ్ల్యూ న్యూస్):** జిహెచ్ఎంసి పరిధిలోని 30 సర్కిల్లో టౌన్ ప్లానింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఏసీపిలు, సెక్షన్ ఆఫీసర్లు భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడతారు ఎవరైనా ప్రశ్నించిన, పత్రికల్లో కథనాలు వచ్చిన అంతే తమకేది తెలియనట్టు "సుద్ధ పూసల వలె" అన్న చందంగా సెలవు పెట్టి వెళ్ళిపోతారు. తర్వాత సర్కిల్ మార్చుకొని వేరే దగ్గర విధులు నిర్వహిస్తూ మళ్లీ భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడతారు. ఈ వింత ఆచారాన్ని ఉన్నంత అధికారులు సైతం ప్రోత్సహిస్తూ వాళ్లకు సెలవులు మంజూరు చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమాలు ప్రోత్సహించడం అవినీతి చేయడం డబ్బులు సంపాదించుకోవడం సెలవులు పెట్టుకొని తప్పించుకోవడం మొన్న బేగంపేట సర్కిల్ ఏసిపి సుస్మిత నేడు బంజారాహిల్స్ సర్కిల్ ఏసీపి ఇంజా శ్రీనివాస్ అవినీతి అక్రమాలు బహిర్గతం కావడంతో సెలవు పై వెళ్లారు. వీళ్లకు సెలవులు ఉన్నత అధికారులు ఎలా మంజూరు చేశారని ఇందులో ఉన్నతాధికారుల వాటా ఎంత ఉందో అని ప్రజలు బహటంగా ప్రశ్నిస్తున్నారు. బంజారా హిల్స్ సర్కిల్ 18 లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉండే పరిధిలోనే ఆకాశానంటే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని టౌన్ ప్లానింగ్ ఏసిపి ఇంజ శ్రీనివాస్ కు స్థానికులు ఫిర్యాదు చేసిన పట్టించుకోకుండా అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలకాడని ఆరోపణలు వినిపిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులకు ఏసీపీ శ్రీనివాస్ పై ఫిర్యాదు చేసిన ఖైరతాబాద్ జోనల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ సిసిపి శ్రీనివాస్ కు లికిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోకుండా కాలయాపన చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. సర్కిల్ ల పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల వసూలు దందా లో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని ఉన్నత అధికారులకు సీసీపీకి ఏమైనా వాటాలు అందుతున్నాయా.? అందుకోసమే చర్యలు తీసుకోవడం లేదా అంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. బంజారాహిల్స్ లో వివిఐపీలు ఉండే ప్రాంతంలో ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు కోకోలలుగా నిర్మించారని అక్రమ నిర్మాణాలకు శ్రీనివాస్ ప్రోత్సాహంతో దాదాపు బంజారాహిల్స్ సర్కిల్ 100 వరకు పైగా అక్రమ నిర్మాణాలు జరిగాయని ఆధారాలతో సహా జిహెచ్ఎంసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఏసీబీ ఇంజ శ్రీనివాస్ పై శాఖపరమైన చర్యలు కానీ సస్పెండ్ కానీ చేయకపోవడం తో జిహెచ్ఎంసి కమిషనర్ ఎందుకు కాలయాపన చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. **కమిషనర్ నిర్లక్ష్యమే అవినీతికి అర్థ్యం..** తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇంజ శ్రీనివాస్ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించారని ఆధారాలతో సహా జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదు చేయడంతో తనపై శాఖా పరమైన చర్యలు అధికారులు తీసుకోకముందే సెలవు పెట్టి వెళ్లారని సమాచారం.? అక్రమ నిర్మాణాల పై గ్రేటర్ హైదరాబాద్ టౌన్ ప్లానింగ్ సిసిపి శ్రీనివాస్ శాఖ పరమైన చర్యలు తీసుకోకపోవడం పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బేగంపేట సర్కిల్ సుస్మిత, బంజారాహిల్స్ సర్కిల్ ఏసీపీ ఇంజ శ్రీనివాస్ అవినీతిలో సిసిపికి ఏమైనా వాటాలు ఉన్నాయా అందుకోసమే ఆయన చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని పదేపదే ఫిర్యాదులు వచ్చిన జిహెచ్ఎంసి కమిషనర్ పట్టించుకోకుండా టౌన్ ప్లానింగ్ ఏసిపి శ్రీనివాస్ కు వత్తాసు పలికారా.? ఏసిపి శ్రీనివాస్ వాటాలో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం అధికారుల వాటా ఎంత అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.గ్రేటర్ హైదరాబాద్ లో టౌన్ ప్లానింగ్ లో ఉన్నంత అవినీతి ఎక్కడ లేదని టౌన్ ప్లానింగ్ అధికారుల పై ఏసీబీ, విజిలెన్స్ విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఇచ్చే లక్షలలో జీతాలు టౌన్ ప్లానింగ్ అధికారులకు సరిపోవడం లేదా వారి అక్రమ ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టి అక్రమ నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్ అధికారులు వత్తాసు పలుకుతున్నారా.? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలకు ప్రోత్సాహం ఇస్తున్నారంటే మున్సిపల్ శాఖ మంత్రి టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోరా అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సర్కిల్ 18 ఏసిపి ఇంజ శ్రీనివాస్ పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ లో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించి అధికారుల పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని ప్రోత్సహించే అధికారులను సస్పెండ్ చేయకుండా పూర్తిగా ఉద్యోగాము నుండి తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జిహెచ్ఎంసిలో సమయపాలన లేకుండా ఇష్టానుసారంగా విధులకు హాజరై ప్రభుత్వ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని సమయపాలన పాటించని గ్రేటర్ హైదరాబాద్ లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులను రేవంత్ రెడ్డి ఎలా దారిలో పెడతాడో చూడాలి. ప్రతిపక్ష స్థానంలో ఉన్నప్పుడు అక్రమ నిర్మాణాల పై చర్యలు చేపట్టాలని అధికారుల పై ఒత్తిడి తెచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు టౌన్ ప్లానింగ్ అధికారుల పై చర్యలు తీసుకోకపోవడం వెనకాల అంతర్యం ఏమిటి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బంజారా హిల్స్, బేగంపేట సర్కిల్ లో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ ఉన్నత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేసి చూడాలి. టౌన్ ప్లాన్ సెక్షన్ ఆఫీసర్ ఇంజా శ్రీనివాస్ సెలవు పై వెళితే అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేయరా.? తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం లిఖితపూర్వకంగా ఆధారాలతో ఫిర్యాదు చేసిన గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కమిషనర్ కర్ణన్ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనకాల ఆంతర్యం ఏమిటో ? అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించే మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల పై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి మరి?

# వైపరీత్యాల సుడిలో దేవభూమి



దేవభూమిగా పేరు పొందిన ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాలు వైపరీత్య వలయాలుగా మారడం శోచనీయం. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఆకస్మిక వరదల ప్రళయం జనజీవనాన్ని అతలాకుతలం చేస్తోంది. ఉత్తరాఖండ్‌లో మెరుపు వరదలు, క్లౌడ్ బరస్ట్‌ల విపత్తుతో కేరళకు చెందిన 28 మంది పర్యాటకుల బృందం గల్లంతైంది. వీరిలో 20 మంది మహారాష్ట్రలో స్థిరపడిన వారు కాగా, మిగిలిన 8 మంది కేరళలోని వివిధ జిల్లాలకు చెందిన వారుగా గుర్తించారు. ఉత్తరాఖండ్‌లో నాలుగు జాతీయ రహదారులతో సహా 617 రోడ్లు ధ్వంసమయ్యాయి. 130 మందికి పైగా ప్రజలను సహాయక బృందాలు రక్షించాయి. కొండచరియలు విరిగిపడుతున్నాయి. ధరాలీ గ్రామమే వరదలకు కొట్టుకుపోయింది. మరో గ్రామం సుకీ జలమయమైంది. హిమాచల్‌లో ఎడతెరిపి లేని వర్షాల కారణంగా కిన్నౌర్ జిల్లాలో భారీ వరదలు సంభవించడంతో కైలాస్ యాత్ర ట్రెక్కింగ్ మార్గంలో వందలాది మంది యాత్రికులు వరదల్లో చిక్కుకున్నారు. ఐటిబిపి సిబ్బంది స్పందించి 413 మంది యాత్రికులను కాపాడగలిగింది. ఈ విధంగా ఏటా ఈశాన్య భారతంలో జలప్రళయం సంభవించడం, కొండచరియలు విరిగిపడడం, గ్రామాలు నేలమట్టం కావడం తరచుగా జరుగుతోంది. పర్యాటక ప్రాంతాలకు ప్రసిద్ధి చెందిన ఈశాన్య భారతంలో టూరిజం అభివృద్ధి చెంది ఆదాయం బాగా వస్తున్నా పొంచి ఉన్న విపత్తుల నివారణ ప్రణాళికలపై ఆయా ప్రభుత్వాలు శ్రద్ధ చూపించడం లేదు. మూడేళ్ల క్రితం భారీ వర్షాలకు ఈశాన్య రాష్ట్రాల్లో 125 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు కొన్ని వేల మంది ప్రాణాలు కోల్పోయే సరికి పాలనా యంత్రాంగాలు కళ్లు తెరిచి లబోదిబోమనడం తప్ప ఈ వైపరీత్యాలను ఎలా నివారించగలమో అన్న ప్రయత్నాలు సరిగ్గా జరగడం లేదు.2013 లో కేదార్‌నాథ్ విషాద సంఘటన నుంచి దేశం సరైన గుణపాఠం నేర్చుకోవడం లేదనిపిస్తోంది. ఆనాడు వేలాది గ్రామాలు వరదల్లో దెబ్బతిన్నాయి. 5000 మంది గల్లంతయ్యారు. క్రమబద్ధం లేకుండా సాగే రియల్ ఎస్టేట్ నిర్మాణాలు విధ్వంసాన్ని మరింత తీవ్రం చేశాయి. 2021లో హిమనదీయ సరస్సు విస్ఫోటనంతో వరద ప్రళయం సంభవించి చమోలీ ప్రాంతాన్ని నాశనం చేసింది. అలాగే జోషిమఠ్ విధ్వంసం ప్రళయం సృష్టించింది. టూరిస్టులను ఆకర్షించడానికి నదీ తీర ప్రాంతాల్లో విలాసవంతమైన విల్లాల నిర్మాణం యథేచ్ఛగా సాగుతోంది. ప్రకృతిపరంగా కొన్ని వైపరీత్యాలు జరుగుతుండగా, మానవ కల్పిత చర్యల వల్ల అంతకన్నా ఎక్కువగానే నష్టం జరుగుతోంది. ఈశాన్య రాష్ట్రాల్లో పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు మౌలిక సదుపాయాల అభివృద్ధి జరగకపోవడం ప్రధాన లోపం.సౌకర్యాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య నెలకొన్న సంక్లిష్టతపై చర్చలు జరుగుతున్నాయి. ఈ రాష్ట్రాల్లో శాస్త్రీయ విశ్లేషణ అనుసరించి నిర్మాణాలు చేపట్టడం అవసరం. హిమాలయ పర్వత ప్రాంతాల్లో ప్రాజెక్టుల నిర్మాణాలతో అత్యధిక సంఖ్యలో చెట్లను కూల్చి వేస్తున్నారు. 2015 నుంచి 2018 మధ్య కాలంలో 10.76 మిలియన్ చెట్లను కూల్చివేశారు. అరుణాచల్‌లోని భారీ డిబాంగ్ డ్యామ్ నిర్మాణం కోసం 2.7 లక్షల చెట్లను కూల్చివేశారు. డెహ్రాడూన్‌లో ప్రాజెక్టుల కోసం 11,000 చెట్లను కూల్చివేయడానికి ప్రభుత్వ వర్గాలు సిద్ధం కాగా, సుప్రీం కోర్టు అడ్డుచక్రం వేసింది. కొండలను తొలిచి సొరంగాలు నిర్మిస్తున్నారు. రోడ్లు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు ఒక ప్రణాళిక లేకుండా సాగే కొండ క్వారీ పనులు ఇవన్నీ కొండచరియలు విరిగిపడడానికి కారణమవుతున్నాయని జిఎస్ఐ అధ్యయనం పేర్కొంది.గత ఏడాది నైరుతి పవనాల ప్రభావంతో సిక్కిం, అసోం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్, త్రిపుర, మిజోరాం, నాగాలాండ్, మేఘాలయాల్లో కుంభవృష్టి సంభవించి ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడ్డాయి. వేలాది మంది నిర్వాసితులయ్యారు. 34 మంది ప్రాణాలు కోల్పోయారు. అసోంలోని 19 జిల్లాల్లో మూడు లక్షల మంది వరకు వరద బాధితులయ్యారు. ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాల నివారణకు బడ్జెట్‌లో మూడోవంతు వెచ్చిస్తోంది. అయినా సరైన ప్రణాళికలు ఆచరణలోకి రావడం లేదు. హిమాలయ పర్వత ప్రాంతాల్లో నేల క్షీణించి కోతకు గురికావడం. జోషిమఠ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో విపరీత పరిణామాలు సంభవించడం చర్చనీయాంశం అవుతున్నాయి. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జిఎస్ఐ) ఈ కొండచరియల ప్రమాదాలపై 2020లో అధ్యయనం నిర్వహించింది.దేశంలోని 16 రాష్ట్రాలు, హిమాలయ రీజియన్‌లోని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు, ఈశాన్యంలోని హిమాలయ పర్వత దిగువ భాగాలు, పశ్చిమ కనుమలు ఇవన్నీ కొండచరియలు అకస్మాత్తుగా విరిగిపడడానికి కారణమవుతున్నాయని జిఎస్ఐ తన నివేదికలో హెచ్చరించింది. అలాగే కొండచరియలు విరిగిపడడానికి ఉత్తరాఖండ్ 51 శాతం అనువైన ప్రాంతంగా వాడియా ఇన్‌స్టిట్యూట్ అధ్యయనంలో తేలింది. ప్రపంచంలోనే భూకంపాలు సంభవించే ఆరో ప్రాంతం గా ఈశాన్య ప్రాంతం రికార్డుకెక్కింది. ఈ ప్రాంతాల్లో ఆరు నెలలపాటు భారీగా వర్షాలు కురుస్తుంటాయి. కొండచరియల ముప్పు తప్పించడానికి నిర్మాణాత్మక ఇంజినీరింగ్ పనులు చేపట్టడం అవసరమని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సూచిస్తోంది. కొండచరియలు విరిగిపడే ప్రాంతాలను గుర్తించి వాటిని నివారించడానికి, తగిన మౌలిక సౌకర్యాలు కల్పించడానికి 'నేషనల్ ల్యాండ్ స్లైడ్ ససెప్టిబిలిటీ మేపింగ్' ప్రక్రియను అమలు చేయవలసి ఉంటుందని జిఎస్ఐ సూచిస్తోంది.



# శ్రీలీలతో నిర్మాతలకు భరోసా

## హీరోయిన్‌గా, డ్యాన్సర్‌గా డ్యూయల్ రోల్

శ్రీలీల ఉంటే ఇక ఆ సినిమాలో స్పెషల్ సాంగ్స్ కోసం మరో భామను వెతకాల్సిన పని లేదు. ఎందుకంటే హీరోయిన్ రోల్‌కే కాదు ఐటమ్ నెంబర్‌కు ఫర్ ఫెక్ట్ ఛాయిస్‌గా మారిపోయింది. డ్యూయెట్ సాంగైనా, ఊర మాస్ పాటైనా మేడమ్ రచ్చ రంబోలా చేయాల్సిందే. స్పెషల్ సాంగ్ కోసం స్టార్ హీరోయిన్లకు నిర్మాతలు కోట్లు వెచ్చించి తెచ్చుకునే ఛాన్స్ లేకుండా కిసిక్ బ్యూటీ డ్యూయల్ రోల్ పోషించేస్తోంది. ధమాకాలో పల్సర్ బైక్, జింతాకా అంటూ మాసీ స్టెప్పులు మొదలెట్టిన దగ్గర నుండి డ్యాన్సింగ్ క్వీన్‌గా ముద్రపడిపోయింది శ్రీలీల. ఫీమేల్ లీడ్‌గా నటిస్తే మాస్ సాంగ్ కంపల్సరీ. ఇక ఐటమ్ నంబర్ కోసం మరో భామకు తెచ్చుకోనక్కర్లేదు. ఏ టు- జెడ్ ఫెర్మామెన్స్ ఇచ్చేస్తుంది కిస్సిక్ బ్యూటీ-. యూట్యూబ్‌ను షేక్ చేయాలంటే మిస్ లీల ఉంటే చాలనేంతలా ప్రొడ్యూసర్ల మైండ్లలో ఫిక్స్ అయ్యేలా చేసింది. సినిమాపై హైప్ రావాలా, అ-టె-న్షన్ కావాలా వైరల్ వయ్యారీతో డ్యాన్స్ చేస్తే పోలా అని భావిస్తున్నారు. గుంటూరు కారంలో కుర్చీ మడత పెట్టినా, జూనియర్‌లో వైరల్ వయ్యారీగా మారినా తాను హీరోయిన్ కాని పుష్ప2లో కూడా కిస్సిక్ బ్యూటీ-గా ర్యాంపేజ్ గ్లామర్ షోతో మాస్ మహారాణిగా మారిపోయింది. ఇటు- హీరోయిన్‌గా, ఇటు- ఐటమ్ గర్ల్‌గా మూవీకి వన్ ఉమెన్ షోగా మేకోవరైంది శ్రీలీల. అంటే నిర్మాతలకు డబుల్ బోనాంజాలా మారిన మేడమ్.. నెక్ట్స్ రవితేజ మూవీ మాస్ జాతరలోనూ అటు- క్లాసీ లుక్, ఇటు- మాసీ సాంగ్స్‌లో గత్తర లేపడానికి రెడీ అయ్యింది. మరోసారి ఈ జోడీ బాక్సాఫీస్ దగ్గర ధమాకా హిట్ నమోదు చేస్తుందా ఎలాపుల్లో ఉన్న రవితేజ, శ్రీలీలకు కంబ్యాక్ మూవీగా మారుతుందో లేదో చూడాలి.



# ప్రభాస్ స్పిరిట్ కోసం ఆఫర్

## • నటించాలనుకునే యువతకు ఛాన్స్

అగ్ర కథానాయకుడు ప్రభాస్, దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కాంబోలో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. 'స్పిరిట్' అనే టైటిల్‌తో రాబోతున్న ఈ చిత్రం దాదాపు రూ. 300 కోట్ల బడ్జెట్‌తో రాబోతుండగా.. ఈ మూవీని టీ- సిరీస్, భద్రకాళి పిక్చర్స్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం సెప్టెంబర్ చివరిలో షూటింగ్ ప్రారంభించనుంది. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీకి సంబంధించి సాలిడ్ అప్‌డేట్‌ను వెల్లడించింది చిత్రబృందం. ప్రభాస్ స్పిరిట్ సినిమాలో నటించేందుకు ఆసక్తి ఉన్న వారిని డిజిటల్ ఆడిషన్స్‌కి పిలుస్తుంది చిత్రయూనిట్. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేసింది భద్రకాళీ పిక్చర్స్. ప్రభాస్ స్పిరిట్ సినిమాలో నటించేందుకు 13 నుంచి 17 ఏండ్ల వయసున్న పురుష నటులను ఆడిషన్స్‌లో పాల్గొనవచ్చని తెలిపింది. అయితే ఆడిషన్స్‌లో పాల్గొనేవారు పాత్ర కోసం తమ జుట్టు- కత్తిరించుకోవడానికి కూడా సిద్ధంగా ఉండాలని తెలిపింది. అలాగే ఒక హెడ్ షాట్ ఫోటోతో పాటు- పర్సనల్ షాట్ ఫోటో కూడా జత చేయాలని కోరారు. ఇక ఇంట్రడక్షన్ వీడియోలో మీ పేరు ఇతర వివరాలు వెల్లడించడంతోపాటు మీ చదువుకు సంబంధించిన వివరాలు కూడా వెల్లడించాలని కోరారు.

# సినీ కార్మికుల సమ్మె.. చిన్ననిర్మాతల భేటీ


టాలీవుడ్ లో గత ఐదు రోజులుగా షూటింగ్స్ లేక మూగబోయింది. వేతనాల పెంపుపు పై కార్మిక సంఘాలకు, ఫిల్మ్ ఛాంబర్ కు మధ్య మొదలైన వివాదం బంద్ కు దారి తీసింది. ఈ విషయమై గురువారం పలువురు చిన్న సినిమా నిర్మాతలతో ఫిల్మ్ ఛాంబర్ సభ్యులు సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సీ. కళ్యాణ్ మాట్లాడుతూ చిన్న సినిమాల నిర్మాతలతో సమావేశం నిర్వహించాము. చిన్న నిర్మాతలు మార్కెటింగ్ లేక థియేటర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. చిన్న సినిమాల వల్లే కార్మికుల మనుగడ ఉంది. ఇప్పటి వరకు తీసుకున్న జీతం కంటే 25శాతం జీతాలు తక్కువ తీసుకోవాలని నిర్మాతలు డిమాండ్ చేశారు. మేము ఒక్క పైసా పెంచమని నిర్మాతలు చెప్పారు. ఎవరితో అయినా సినిమాలు తీసుకుంటామని చెబుతున్నారు. ప్రొడ్యూసర్ కౌన్సిల్ ఏం నిర్మాణం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటామని చెప్పారు.రూ. 4 నుండి 5 కోట్లు- చిన్న సినిమాకు ఖర్చు అవుతుంది. చిన్న సినిమా నిర్మాతలు ఇప్పటి నుంచి ఎవరితో అయినా సినిమాలు చేసుకోవచ్చు. ప్రొడ్యూసర్స్ మీద దాడి చేస్తే తాట తీస్తాం.పెద్ద హీరోలకు నిర్మాతలు తమ బాధలు చెప్పుకున్నారు. కార్మికులు గొంతెమ్మ కోరికలు విడనాడాలి. రెండు రోజుల్లో సమ్మె ముగుస్తుందని భావిస్తున్నా...నిన్ననే దిల్ రాజుతో మాట్లాడను మళ్ళీ ఎప్పుడు కబురు పంపినా మాట్లాడడానికి మేము సిద్ధం అన్నారు.

నిర్మాత చదలవాడ శ్రీనివాస్ మాట్లాడుతూ చాంబర్, కౌన్సిల్ మాత్రమే ఈ సమస్య పై మాట్లాడే అధికారం ఉంది.తొందరలోనే సమ్మె ముగుస్తుందని ఆశిస్తున్నాం. ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల కంటే తెలుగు రాష్ట్రల్లో జీతాలు ఎక్కువగా ఇస్తున్నాం. చిన్న సినిమా బ్రతికితేనే సినిమా బ్రతుకుటుంది.98 శాతం ఫెల్యూర్ ఉంది. నిర్మాత చనిపోతూ కార్మికులను బ్రతికిస్తున్నాడు. అసలు ఇస్తున్న రెమ్యునరేషన్ ను 25 శాతం తగ్గించి ఇవ్వాలని అనుకున్నాం. కానీ స్టార్ హిరోలతో తీయని సినిమా ఏదైనా చిన్న సినిమానే. నిర్మాతలు కోమాలో ఉన్నారు. ఆక్సిజన్ తీసేసి మమ్మల్ని చంపేయవద్దు.




ఈ సమస్య ఛాంబర్ లోనే పరిష్కరించుకుంటాం. ఇతరుల ప్రమేయం అవసరం లేదు. అందరం ఒకే కుటుంబ సభ్యులమని అన్నారు.

# అర్జున్ చక్రవర్తి నుంచి మేఘం వర్షించదా పాట




టాలీవుడ్ యువ నటుడు విజయ రామరాజు టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం'అర్జున్ చక్రవర్తి'. ఇప్పటికే పలు అంతర్జాతీయ చలనచిత్ర వేదికలలో 46కి పైగా అవార్డులు గెలుచుకున్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ 'మేఘం వర్షించదా' అనే పాటను విడుదల చేశారు. విఘ్నేష్ బాస్కరన్ ఈ అందమైన ప్రేమ గీతాన్ని కంపోజ్ చేయగా.. విక్రాంత్ రుద్ర రాసిన సాహిత్యం మనసును హత్తుకునేలా ఉంది. కపిల్ కపిలన్, మీరా ప్రకాష్, సుజిత్ శ్రీధర్ తమ మ్యాజికల్ వాయిస్‌తో ఆకట్టు-కున్నారు. ఈ పాటలో విజయరామరాజు, సిజా రోజ్ కెమిస్ట్రీ ఆకట్టు-కునేలా ఉంది. అద్భుతమైన స్పోర్ట్స్ డ్రామాతో పాటు- హార్ట్ టచింగ్ లవ్ స్టోరీతో 'అర్జున్ చక్రవర్తి' అలరించ బోతుందని ఈ పాట తెలియజేస్తుంది. విజయ రామరాజు, సిజా రోజ్, హర్ష్ రోషన్, అజయ్, అజయ్ ఘోష్, దయానంద్ రెడ్డి, దుర్గేష్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.విక్రాంత్ రుద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమాకి శ్రీని గుబ్బల నిర్మాతగా, ఈడే కృష్ణ చైతన్య సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రానికి విఘ్నేష్ బాస్కరన్ సంగీతం అందించగా, జగదీష్ చీకాటి సినిమాటోగ్రఫీ, ప్రదీప్ నందన్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. ఈ సినిమాకు కృష్ణకాంత్ సాహిత్యం, రవీంద్ర పుల్లె సంభాషణలు రాశారు. పూజిత తాడికొండ కాస్ట్యూమ్ డిజైనర్‌గా, విష్ణు వర్ధన్ కలర్స్ ని అందించారు. పబ్లిసిటీ- డిజైన్ స్కేల్ టిల్ట్ స్టూడియోస్, విఎఫ్ఎక్స్ మ్యాడ్‌హౌస్ విఎఫ్ఎక్స్ చేయగా, తేజస్వి సజ్జా పిఆర్ఓ గా వ్యవహరించారు, హాష్‌ట్యాగ్ మీడియా మార్కెటింగ్ బాధ్యతలు చూసుకుంది.

# మణిరత్నం మరో లవ్‌స్టోరీ



యువహీరో ధ్రువ్ విక్రమ్‌తో మూవీ

ప్రముఖ దర్శకుడు మణిరత్నం పేరు వినగానే అందరికీ గుర్తొచ్చేది హృదయాలను తాకే అందమైన ప్రేమ కథలు. అయితే ఇటీవల ఆయన దర్శకత్వంలో వచ్చిన 'థగ్‌లైఫ్' చిత్రం ఆశించిన స్థాయిలో ప్రేక్షకుల్ని ఆకట్టుకోలేకపోయింది. ఈ సినిమా ఫలితంగా కొంత నిరాశకు లోనైన మణిరత్నం, తన ఫేవరెట్ జోనర్ అయిన లవ్ డ్రామా వైపు మళ్లీ రీటర్న్ అవ్వడానికి సిద్ధమవుతున్నారు. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఆయన కొత్తగా తెరకెక్కించబోయే చిత్రంలో తమిళ యువ హీరో ధ్రువ్ విక్రమ్, కన్నడ బ్యూటీ- రుక్మిణి వసంత్ హీరో హీరోయిన్లుగా నటించనున్నారు. తొలిసారి స్క్రీన్ పై కలసి నటించనున్న ఈ జంట సినిమాకు హైలైట్‌గా నిలవనుందని భావిస్తున్నారు.ప్రేమ, కుటుంబ సంబంధాలు, వ్యక్తిగత సంఘర్షణలు అన్నీ కలగలిపిన ఒక భావోద్వేగ భరితమైన కథతో మణిరత్నం ఈ సినిమాను రూపొందించనున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. నవంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు ఎలాన్ చేస్తున్నారు. ఈ సినిమాకు సంగీతం అందించనున్న ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ మరో స్పెషల్ అట్రాక్షన్ కానుంది. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశముంది. మణిరత్నం గత సినిమాలకన్నా పూర్తి భిన్నంగా, కొత్త ఎనర్జీతో ఈ సినిమాను తెరకెక్కించనున్నారని తెలిసింది. కథలోని పాత్రలు, వారి మధ్య ఉన్న బంధాలు ప్రేక్షకులకు కొత్తగా అనిపించేలా మణిరత్నం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ఫిలింనగర్ వర్గాలు చెబుతున్నాయి. సుదీర్ఘ విరామం తర్వాత మణిరత్నం మళ్లీ ఓ క్లాస్ లవ్ స్టోరీతో వెండితెరపై సందడి చేయబోతుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు నెలకొన్నాయి.